


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | సోమవారం 24-08-2026 | సంపుటి - 31 | సంచిక - 91 | రూ : 4 | పేజీలు: 8


## విశాఖ వేదికగా 'బ్రిక్స్' క్రీడా తీర్మానం..

# కీలక ప్రతిపాదనలు చేసిన భారత్

### విశాఖపట్నంలో ముగిసిన బ్రిక్స్ క్రీడా మంత్రుల సమావేశం

- క్రీడల్లో పరస్పర సహకారానికి సభ్య దేశాల ఉమ్మడి ప్రకటన
- క్రీడా ఉత్పత్తుల తయారీ, సంప్రదాయ క్రీడలపై భారత్ కీలక ప్రతిపాదనలు
- 'మేక్ ఇన్ ఇండియా, ప్లే ఇన్ ఇండియా' నినాదంతో ముందుకు వెళ్లాలన్న కేంద్ర మంత్రి
- భేటీకి ముందు విశాఖలో బ్రిక్స్ ఫ్రెండ్‌షిప్ సైక్లింగ్ ఈవెంట్




అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం వేదికగా జరిగిన బ్రిక్స్ క్రీడా మంత్రుల సమావేశం 2026 విజయవంతంగా ముగిసింది. క్రీడారంగంలో సభ్య దేశాల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో రూపొందించిన 'బ్రిక్స్ క్రీడా ఉమ్మడి ప్రకటన'కు సమావేశంలో ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. చర్చలు, పరస్పర గౌరవం, సమ్మిళితత్వంతో ముందుకు సాగాలని దేశాలు పునరుద్ఘాటించాయి. భారత్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బ్రిక్స్ సభ్య దేశాల క్రీడా మంత్రులు, సీనియర్ ప్రతినిధులు పాల్గొన్నారు. క్రీడల అభివృద్ధి, భవిష్యత్ సహకారంపై కీలక ప్రాధాన్యతలను చర్చించారు. సమావేశాన్ని ప్రారంభించిన కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ, కేవలం ప్రకటనలకే పరిమితం కాని బలమైన బ్రిక్స్ క్రీడా భాగస్వామ్యాన్ని

తరువాయి 2లో



2లో

## అన్ని విషయాలపై మాట్లాడతా!

- రాజకీయ కారణాలతోనే నా అమెరికా పర్యటనకు అనుమతివ్వలేదు
- కేంద్రంపై సీఎం రేవంత్‌రెడ్డి విమర్శ
- ముగిసిన లండన్ పర్యటన

## సురేఖపై అధిష్ఠానానికి నివేదిక

- మంత్రి వైఖరి సరికాదని ఏఐసీసీకి తెలిపిన పీసీసీ
- వేటు వేయాల్సిందేనని ఢిల్లీకి పలువురి ఫిర్యాదు
- చిన్నారెడ్డిపైనా పార్టీ సీరియస్
- ఇద్దరిపై చర్యలకు అవకాశం ! కొండాపై వేటు పడితే మంత్రివర్గంలోనూ మార్పులు?

2లో

## ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యంపై ఆందోళన

### రంగంలోకి 21 మంది మాజీ కెప్టెన్లు

- ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యంపై పాక్ ప్రధానికి లేఖ
- లేఖ రాసిన వారిలో గవాస్కర్, కపిల్ దేవ్ సహా 21 మంది మాజీ కెప్టెన్లు
- సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు వైద్య పరీక్షలు జరపాలని డిమాండ్
- ఇది రాజకీయ జోక్యం కాదని, కేవలం క్రీడా స్ఫూర్తితోనే అని స్పష్టీకరణ



పాకిస్థాన్ మాజీ ప్రధాని, ప్రపంచ కప్ విన్నింగ్ కెప్టెన్ ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యంపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఆయనకు మానవతా దృక్పథంతో మెరుగైన వైద్య సంరక్షణ అందించాలని కోరుతూ ప్రపంచవ్యాప్తంగా 21 మంది మాజీ క్రికెట్ కెప్టెన్లు పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్

తరువాయి 2లో



## యువత..

## కొత్త టెక్నాలజీలను నిర్మిస్తోంది

- జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా దేశ ప్రజలకు ప్రధాని మోదీ శుభాకాంక్షలు
- అంతరిక్ష రంగంలో భారత్ పెట్టుబడిదారులకు ఆకర్షణీయ కేంద్రంగా మారిందన్న పీఎం
- కొత్త టెక్నాలజీలను ఆవిష్కరిస్తున్న జెన్-జీ ఇంజనీర్లపై ప్రధాని ప్రశంసలు
- చంద్రయాన్-3 ల్యాండింగ్ గుర్తుగా ఆగస్టు 23న అంతరిక్ష దినోత్సవం
- 'వికసిత భారత్' లక్ష్యంతో ఈ ఏడాది అంతరిక్ష దినోత్సవ వేడుకలు

2లో

## అంతరిక్షంలో భారత్ 'నిఘా నేత్రాలు'

- అంతరిక్షం నుంచి శత్రు క్షిపణి ప్రయోగాలను గుర్తించే సామర్థ్యంపై భారత్ దృష్టి
- ఆపరేషన్ సిందూర్ అనుభవంతో భూస్థిత రాడార్ల పరిమితులను అధిగమించే ప్రయత్నం
- 'ఎస్‌బీఎస్-3' ప్రాజెక్టుతో పాటు ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యంతో పటిష్ఠ వ్యవస్థ నిర్మాణం
- బూస్ట్ దశలోనే క్షిపణిని గుర్తించి, దాడిని నిరోధించడానికి ఎక్కువ సమయం పొందడమే లక్ష్యం



భారత రక్షణ రంగం సరికొత్త సాంకేతిక యుగంలోకి అడుగుపెడుతోంది. శత్రు దేశాల నుంచి ప్రయోగించే క్షిపణులను సెకన్ల వ్యవధిలోనే గుర్తించి, వాటిని గగనతలంలోనే ధ్వంసం చేసేందుకు వీలుగా అంతరిక్ష ఆధారిత ముందస్తు హెచ్చరిక వ్యవస్థను (స్పేస్‌బేస్డ్ ఇన్‌ఫ్రారెడ్ ఎర్లీ వార్నింగ్) భారత్ వేగంగా అభివృద్ధి చేస్తోంది. ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా ఈ కీలక పరిణామం వెలుగులోకి వచ్చింది. 'అంతరిక్షంలో కళ్లు' (ఐస్ ఇన్ స్పేస్)గా పిలుస్తున్న ఈ వ్యవస్థ ద్వారా క్షిపణి ప్రయోగ సమయంలో దాని ఇంజిన్ల నుంచి వెలువడే అత్యధిక వేడిని (ఇన్‌ఫ్రారెడ్ సిగ్నేచర్) ఉపగ్రహాలు తక్షణమే పసిగడతాయి. దీంతో క్షిపణిని దాని ప్రయాణ మార్గంలోనే అడ్డగించి, నాశనం చేయడానికి భారత రక్షణ దళాలకు అమూల్యమైన సమయం లభిస్తుంది.

తరువాయి 2లో

## గూగుల్ ఫైర్‌బేస్ అడ్డాగా సైబర్ మోసాలు..

# 57 వెబ్‌సైట్లపై కేంద్రం వేటు

- ఫిషింగ్, ఆర్థిక మోసాలకు పాల్పడుతున్న వైనం
- ప్రముఖ బ్యాంకుల పేర్లతో నకిలీ వెబ్‌సైట్ల సృష్టి
- 57 వెబ్‌సైట్లను తొలగించాలని గూగుల్‌కు ప్రభుత్వ ఆదేశం



సైబర్ నేరగాళ్లు తమ మోసాలకు ఇప్పుడు కొత్త మార్గాలను అన్వేషిస్తున్నారు. టెక్నాలజీ దిగ్గజం గూగుల్‌కు చెందిన ప్రముఖ క్లౌడ్ సర్వీస్ 'ఫైర్‌బేస్' ప్లాట్‌ఫామ్‌నే తమ అడ్డాగా మార్చుకుని భారీ ఆర్థిక మోసాలకు పాల్పడుతున్నట్లు భారత సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (I4C) గుర్తించింది. ఈ నేపథ్యంలో, మోసపూరిత కార్యకలాపాలకు వేదికగా మారిన దాదాపు 57 వెబ్‌సైట్లు, డేటాబేస్‌లను తక్షణమే తొలగించాలని కేంద్ర ప్రభుత్వం గూగుల్‌ను ఆదేశించింది.

**నకిలీ వెబ్‌సైట్లతో దాడులు ఎలా?**

తరువాయి 2లో

## దేశంలో 8.7 కోట్ల మంది

# యువత ఖాళీ

### : నీతి ఆయోగ్



- వీరికి చదువు, ఉద్యోగం, శిక్షణ ఏదీ లేదన్న నివేదిక
- వీరిని 'నీట్' వర్గంగా పేర్కొన్న నీతి ఆయోగ్
- డిగ్రీ చదివినా 8 శాతం మందికే అర్హతకు తగ్గ ఉద్యోగాలు
- ఈ యువతలో 88 శాతం మంది ఇంటి పనుల్లోనే ఉన్నారని వెల్లడి

2లో

## జపాన్‌లో మళ్లీ భూకంపం..

## వణికిన రాజధాని టోక్యో

# విశాఖ వేదికగా 'బ్రిక్స్' క్రీడా తీర్మానం.. కీలక ప్రతిపాదనలు చేసిన భారత్

(మొదటిపేజీ తరువాయి)

నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. "అథ్లెట్లు, కోచ్‌ల మార్పిడి, ఉమ్మడి పోటీలు, క్రీడా విజ్ఞానాన్ని పంచుకోవడం వంటి అంశాల్లో వాస్తవ వేదికలను సృష్టించాలి" అని ఆయన అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ తన క్రీడా వ్యవస్థను సమూలంగా మారుస్తోందని, క్షేత్ర స్థాయి నుంచి పతకాల వేదిక వరకు అవకాశాలను సృష్టిస్తోందని మాండవీయ వివరించారు. క్రీడా వస్తువుల తయారీని బలోపేతం చేయడానికి భారత్ చేస్తున్న కృషిని ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. "మేక్ ఇన్ ఇండియా, ప్లే ఇన్ ఇండియా, గ్రో విత్ ఇండియా" నినాదంతో ప్రపంచ తయారీదారులు, టెక్నాలజీ కంపెనీలు, పెట్టుబడిదారులను భారత్‌కు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో భారత్ మూడు కీలక కార్యక్రమాలను ప్రతిపాదించగా, వాటికి సభ్య దేశాల నుంచి విస్తృత మద్దతు లభించింది.

1. వర్కింగ్ గ్రూప్: క్రీడా విజ్ఞానం, అథ్లెట్ల ప్రదర్శన, పాలన, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ ఆవిష్కరణలలో సహకారాన్ని పెంచేందుకు ఒక వర్కింగ్ గ్రూప్‌ను ఏర్పాటు చేయనున్నారు.
2. క్రీడా వస్తువుల తయారీ సదస్సు: క్రీడా వస్తువుల తయారీ, టెక్నాలజీ, వాణిజ్యం వంటి అంశాలపై 2026 నవంబర్‌లో రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో తొలి సదస్సు నిర్వహించాలని ప్రతిపాదించారు.
3. సాంప్రదాయ క్రీడల ప్రదర్శన: బ్రిక్స్ దేశాల సాంప్రదాయ, దేశీయ క్రీడలను ప్రదర్శించేందుకు అక్టోబర్ 12, 13 తేదీల్లో అహ్మదాబాద్‌లో ప్రత్యేక కార్యక్రమం జరపాలని నిర్ణయించారు.

అంతకుముందు, మంత్రులు, ప్రతినిధులు విశాఖలో జరిగిన 'ఫిట్ ఇండియా సండేస్ ఆన్ సైకిల్' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన బ్రిక్స్ ఫ్రెండ్‌షిప్ సైక్లింగ్ ఈవెంట్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ఫిట్‌నెస్, ఆరోగ్యకరమైన జీవనశైలి పట్ల బ్రిక్స్ దేశాల ఉమ్మడి నిబద్ధతను ప్రతిబింబించింది. భారత్ అధ్యక్షతన క్రీడారంగంలో సాధించిన పురోగతిని సభ్య దేశాలు స్వాగతించాయి.

# అన్ని విషయాలపై మాట్లాడతా!

(మొదటిపేజీ తరువాయి)

హైదరాబాద్: రాజకీయ కారణాలతోనే తన అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వలేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. హైదరాబాద్ వచ్చాక అన్ని విషయాలపై మాట్లాడతానని వెల్లడించారు. మూడ్రోజుల లండన్ పర్యటన ముగించుకున్న సీఎం రేవంత్‌రెడ్డి...సోమవారం హైదరాబాద్ రానున్నారు. తన పర్యటన గురించి ముఖ్యమంత్రి 'ఎక్స్'లో స్పందించారు. ''అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరించిన అంశంపై బలమైన మద్దతు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకి హృదయపూర్వక ధన్యవాదాలు. దేశ ప్రయోజనాల కోసం ఈ విషయంలో అండగా నిలిచిన పార్టీ, నాయకులు, ప్రజలకు ధన్యవాదాలు. లండన్‌లో షెడ్యూలు ప్రకారం సమావేశాలు, కార్యక్రమాలను ముగించా. కొన్ని గంటల్లో ముందస్తు షెడ్యూలు ప్రకారం బోస్టన్‌కు వెళ్లాల్సి ఉంది. కేంద్రం రాజకీయ కారణాలతో అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరించినందున హైదరాబాద్ తిరుగు ప్రయాణమవుతున్నా'' అని పేర్కొన్నారు. ''కేంద్ర ప్రభుత్వ నూతన విద్యావిధానంలో భాగంగా ప్రపంచంలోని అత్యుత్తమ సంస్థలను తెలంగాణకు తీసుకురావడమే పర్యటన ముఖ్య ఉద్దేశం. ఐవీలీగ్, ప్రపంచ అత్యున్నత సంస్థల నుంచి విద్య, నైపుణ్యాలు, శిక్షణ పొందాలనే యువత ఆకాంక్షలకు ఈ పర్యటన సమాధానంగా నిలిచేది. దేశ నిర్మాణం, యువత భవిష్యత్తుపై రాజకీయాలకు అతీతంగా ఆలోచించాలి''అని సీఎం తెలిపారు.

# అంతరిక్షంలో భారత్ 'నిఘా నేత్రాలు'

(మొదటిపేజీ తరువాయి)

గతంలో జరిగిన 'ఆపరేషన్ సిందూర్' ఈ కొత్త వ్యవస్థ ఆవశ్యకతను స్పష్టం చేసింది. ఆ సమయంలో పాకిస్థాన్ ప్రయోగించిన ఒక హైస్పీడ్ క్షిపణి ఢిల్లీ వైపు దూసుకొస్తుండగా, హర్యానాలోని సిర్సా వద్ద భారత వాయు రక్షణ వ్యవస్థ దానిని అడ్డగించింది. అయితే, క్షిపణి లక్ష్యాన్ని చేరడానికి కేవలం ఒకటి, రెండు నిమిషాల సమయం మాత్రమే ఉండగా ఈ అడ్డగింత సాధ్యమైంది. భూమిపై ఉన్న రాడార్లు భూమి వక్రత కారణంగా ఒక పరిమితి మేరకే పనిచేస్తాయి. దీంతో ముప్పును గుర్తించడానికి తక్కువ సమయం ఉంటుంది. ఈ సమస్యను అధిగమించి, శత్రువు దాడిని ముందుగానే పసిగట్టడమే అంతరిక్ష ఆధారిత సెన్సార్ల ప్రధాన లక్ష్యం.

**వ్యవస్థ పనిచేసే విధానం**

బాలిస్టిక్ క్షిపణులు ప్రధానంగా మూడు దశల్లో ప్రయాణిస్తాయి. మొదటిది 'బూస్ట్' దశ. ఈ సమయంలో ఇంజిన్లు మండి, తీవ్రమైన వేడిని విడుదల చేస్తాయి. అంతరిక్షంలోని ఇన్‌ఫ్రారెడ్ సెన్సార్లు ఈ వేడిని ప్రయోగించిన సెకన్ల వ్యవధిలోనే గుర్తిస్తాయి. రెండోది 'మిడ్‌కోర్స్' దశ. ఈ దశలో క్షిపణి వాతావరణం బయట ప్రయాణిస్తుంది. మూడోది 'టెర్మినల్' దశ. ఈ దశలో క్షిపణి అత్యంత వేగంతో (మాక్ 15కు పైగా) లక్ష్యం వైపు దూసుకొస్తుంది. భూస్థిత రాడార్లు కేవలం టెర్మినల్ దశలోనే క్షిపణిని గుర్తించగలవు. కానీ అంతరిక్షంలోని ఉపగ్రహాలు బూస్ట్ దశలోనే గుర్తించి హెచ్చరికలు పంపుతాయి. దీనివల్ల 'కిల్ చైన్' (గుర్తించడం, ట్రాక్ చేయడం, ధ్వంసం చేయడం) ప్రక్రియ చాలా ముందుగా ప్రారంభమవుతుంది. దీంతో వాతావరణం లోపల, వెలుపల కూడా క్షిపణిని కూల్చివేసేందుకు అవకాశం లభిస్తుంది. డీఆర్‌డీఓ ఇప్పటికే ఇటువంటి క్షిపణి విధ్వంసక పరీక్షలను విజయవంతంగా నిర్వహించింది.

**ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం**

ఈ అత్యాధునిక వ్యవస్థ రూపకల్పనలో భారత ప్రభుత్వం, ప్రైవేట్ స్టార్టప్‌లు కలిసి పనిచేస్తున్నాయి. బెంగళూరుకు చెందిన 'దిగంతర' స్టార్టప్ 'ఆల్బట్రాస్' ఉపగ్రహాలతో బూస్ట్ దశలోనే క్షిపణులను గుర్తించే సాంకేతికతపై పనిచేస్తోంది. అహ్మదాబాద్‌కు చెందిన 'శాట్‌లియో ల్యాబ్స్' 15 ఉపగ్రహాలతో కూడిన థర్మల్ అబ్జర్వేషన్ వ్యవస్థను నిర్మిస్తోంది. ఇవి క్షిపణి ప్రయోగం వంటి అత్యధిక ఉష్ణోగ్రత ఘటనలను గుర్తించి, రియల్ టైమ్‌లో సమాచారం అందిస్తాయి. ఈ ప్రైవేట్ ప్రయత్నాలకు తోడుగా, కేంద్ర భద్రతా కేబినెట్ కమిటీ (CCS) 'స్పేస్ బేస్డ్ సర్వైలెన్స్ ఫేజ్ 3' (ఎస్‌బీఎస్3) అనే భారీ కార్యక్రమానికి ఆమోదం తెలిపింది. సుమారు రూ.27,000 కోట్ల వ్యయంతో 2029 నాటికి 52 ఉపగ్రహాల (21 ఇస్రో, 31 ప్రైవేట్) సమూహాన్ని అంతరిక్షంలో మోహరించనున్నారు. ఈ నెట్‌వర్క్ నిరంతర నిఘా, శత్రువుల మొబైల్ లాంచర్ల ట్రాకింగ్, కమ్యూనికేషన్స్ వంటి బహుళ ప్రయోజనాలకు ఉపయోగపడుతుంది. ఈ బహుళ అంచెల రక్షణ వ్యూహం ద్వారా శత్రువు ఆకస్మిక దాడులు చేసే అవకాశాలను తగ్గించి, భారత రక్షణ సామర్థ్యాన్ని అసాధారణ స్థాయికి తీసుకెళ్లాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

# ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యంపై ఆందోళన రంగంలోకి 21 మంది మాజీ కెప్టెన్లు

షరీఫ్‌కు లేఖ రాశారు. వీరిలో భారత క్రికెట్ దిగ్గజాలు సునీల్ గవాస్కర్, కపిల్ దేవ్, దిలీప్ వెంగ్‌సర్కార్ కూడా ఉండటం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇది రాజకీయ జోక్యం కాదని, కేవలం క్రీడా స్ఫూర్తితోనే ఈ విజ్ఞప్తి చేస్తున్నామని వారు స్పష్టం చేశారు. గత మూడేళ్లకు పైగా జైలు శిక్ష అనుభవిస్తున్న 73 ఏళ్ల ఇమ్రాన్ ఖాన్‌కు ఆయన వ్యక్తిగత వైద్యులతో కూడిన బోర్డుతో వైద్య పరీక్షలు జరిపించాలని పాక్ సుప్రీంకోర్టు ఇటీవల ఆదేశించింది. అయితే, ఆ ఆదేశాలు పూర్తిగా అమలు కాలేదని ఈ లేఖలో మాజీ కెప్టెన్లు ఆరోపించారు. కోర్టు ఆదేశాలకు విరుద్ధంగా, కేవలం కొన్ని గంటల పాటే ఆసుపత్రిలో ఉంచి ప్రభుత్వ వైద్యులతో పరీక్షలు జరిపి, 'ఆరోగ్యంగానే ఉన్నారు' అని చెప్పి తిరిగి జైలుకు పంపించారని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఇమ్రాన్ కుడి కంటి చూపు మందగించిందని వస్తున్న వార్తలపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. తమ లేఖలో మాజీ కెప్టెన్లు మూడు ప్రధాన డిమాండ్లను ప్రస్తావించారు.

1. సుప్రీంకోర్టు ఆదేశించినట్టుగా, ఇమ్రాన్ వ్యక్తిగత వైద్యులతో కూడిన స్వతంత్ర బోర్డుతో పూర్తిస్థాయి ఆరోగ్య పరీక్షలు జరిపించాలి.
2. వారానికోసారి కుటుంబ సభ్యులతో సమావేశానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా అనుమతించాలి.
3. వైద్య పరీక్షల అనంతరం బోర్డు సూచించిన చికిత్సను తక్షణమే అందించాలి.

ఆరు నెలల క్రితం 14 మంది కెప్టెన్లు ఇలాంటి లేఖ రాయగా, ఇప్పుడు 21 మంది కెప్టెన్లు తమ గళం వినిపించారు. ఆస్ట్రేలియాకు చెందిన అలెన్ బోర్డర్, గ్రెగ్ చాపెల్, స్టీవ్ వా, ఇంగ్లండ్‌కు చెందిన మైఖేల్ అథర్టన్, వెస్టిండీస్ దిగ్గజం సర్ క్లైవ్ లాయిడ్, శ్రీలంక మాజీ కెప్టెన్ అర్జున రణతుంగ వంటి ప్రముఖులు ఈ లేఖపై సంతకాలు చేశారు. "ఈ సమస్య త్వరగా పరిష్కారమవుతుందని, ఇమ్రాన్ ఖాన్‌కు తగిన గౌరవం దక్కుతుందని ఆశిస్తున్నాం. యువర్స్ ఇన్ క్రికెట్" అంటూ లేఖను ముగించారు.

**సంతకాలు చేసిన మాజీ కెప్టెన్లు వీరే...**

మైకేల్ అథర్టన్, అలెక్స్ బ్లాక్‌వెల్, అలన్ బోర్డర్, మైకేల్ బ్రియర్లీ, గ్రెగ్ చాపెల్, ఇయాన్ చాపెల్, బెలిండా క్లార్క్, అలిస్టర్ కుక్, సునీల్ గవాస్కర్, లీ జెర్మాన్, ఆడమ్ గిల్‌క్రిస్ట్, డేవిడ్ గోవర్, కిమ్ హ్యూస్, నాసిర్ హుస్సేన్, సర్ క్లైవ్ లాయిడ్, కపిల్ దేవ్, అర్జున రణతుంగ, ఆండ్రూ స్ట్రాస్, దిలీప్ వెంగ్‌సర్కార్, స్టీఫెన్ వా, జాన్ రైట్.

# గూగుల్ ఫైర్‌బేస్ అడ్డాగా సైబర్ మోసాలు.. 57 వెబ్‌సైట్లపై కేంద్రం వేటు

(మొదటిపేజీ తరువాయి)

సైబర్ నేరగాళ్లు గూగుల్ ఫైర్‌బేస్ ద్వారా వెబ్‌సైట్లను హోస్ట్ చేసి, వాటిని అచ్చం ప్రముఖ బ్యాంకులు, ఇతర విశ్వసనీయ సంస్థల వెబ్‌సైట్లలాగే రూపొందిస్తున్నారు. ముఖ్యంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (SBI), ఐసీఐసీఐ, యాక్సిస్ బ్యాంక్ వంటి బ్యాంకుల పేర్లతో నకిలీ పేజీలను సృష్టించి వినియోగదారులను తప్పుదారి పట్టిస్తున్నారు. ఈ నకిలీ వెబ్‌సైట్లను చూసి నిజమైనవిగా భ్రమపడిన వినియోగదారులు తమ క్రెడిట్ కార్డ్ వివరాలు, వన్‌టైమ్ పాస్‌వర్డ్ (OTP) వంటి అత్యంత సున్నితమైన సమాచారాన్ని నమోదు చేసి మోసపోతున్నారు.

**అసలేంటి ఈ ఫైర్‌బేస్?**

ఫైర్‌బేస్ అనేది గూగుల్ అందించే ఒక క్లౌడ్ ఆధారిత డెవలప్‌మెంట్ ప్లాట్‌ఫామ్. మొబైల్ అప్లికేషన్లు, వెబ్‌సైట్లను సులభంగా, వేగంగా రూపొందించడానికి డెవలపర్లు దీనిని ఉపయోగిస్తారు. వెబ్‌సైట్ హోస్టింగ్, డేటా నిల్వ, యూజర్ అథెంటికేషన్ వంటి అనేక సేవలను ఇది రెడీమేడ్‌గా అందిస్తుంది. డెవలపర్లు ప్రతి అంశాన్ని మొదటి నుంచి నిర్మించుకునే శ్రమ లేకుండా ఇది సహాయపడుతుంది.

**మోసగాళ్ల వ్యూహం ఇదే..**

విశ్వసనీయమైన గూగుల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను ఉపయోగించడం వల్ల ఈ నకిలీ వెబ్‌సైట్లు అనుమానాస్పదంగా కనిపించవు. ఉదాహరణకు, పీఎంకిసాన్ పథకం కింద సాయం అందిస్తామంటూ నకిలీ వెబ్‌సైట్లను సృష్టించి, ప్రజలను నమ్మించి ఒక మాల్వేర్ అప్లికేషన్‌ను డౌన్‌లోడ్ చేయిస్తున్నారు. ఆ యాప్ ద్వారా బాధితుల ఫోన్లలోని విలువైన సమాచారాన్ని దొంగిలించి, దాన్ని ఫైర్‌బేస్‌లో ఉన్న తమ డేటాబేస్‌కు పంపుతున్నారు. ఇలా నకిలీ వెబ్‌సైట్, మాల్వేర్ యాప్, డేటాబేస్‌లతో కూడిన ఒక గొలుసుకట్టు వ్యవస్థను నేరగాళ్లు నిర్వహిస్తున్నారు. అయితే, ఇక్కడ సమస్య గూగుల్ ఫైర్‌బేస్ ప్లాట్‌ఫామ్‌ది కాదు, సైబర్ నేరగాళ్లు ఒక మంచి టెక్నాలజీని తమ స్వార్థానికి, మోసాలకు దుర్వినియోగం చేయడమే అసలు సమస్య. ఐ4సీ పంపిన నోటీసుల ఆధారంగా భారత ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. ఈ దాడుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద లింక్‌లను క్లిక్ చేయవద్దని అధికారులు సూచిస్తున్నారు.

# యువత కొత్త టెక్నాలజీలను నిర్మిస్తోంది

జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు, శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలిపారు. అంతరిక్ష రంగంలో భారత్ ప్రపంచవ్యాప్తంగా దూసుకుపోతోందని, పెట్టుబడిదారులకు ఒక 'ఆయస్కాంతం'లా మారిందని ఆయన అభివర్ణించారు. ఈ సందర్భంగా జెన్‌జీ యువత సరికొత్త టెక్నాలజీలను నిర్మిస్తోందని ప్రశంసించారు. ఆదివారం ప్రధాని మోదీ తన ప్రసంగాలతో కూడిన ఒక వీడియోను పంచుకున్నారు. "అయోధ్యలో నేను చెప్పినట్లుగా ఇది ఒక కొత్త మార్పునకు నాంది. ఈ కొత్త శకంలో, ప్రపంచ క్రమంలో భారత్ తన అంతరిక్ష ఉనికిని స్థిరంగా విస్తరిస్తోంది. 2047 నాటికి వికసిత భారత్ సాధించాలన్న మన సంకల్పంలో అంతరిక్ష రంగం కీలక పాత్ర పోషిస్తుంది" అని మోదీ పేర్కొన్నారు. దేశ యువతను కొనియాడుతూ "ఈ రోజు మన జెన్‌జీ ఇంజనీర్లు, డిజైనర్లు, కోడర్లు, శాస్త్రవేత్తలు కొత్త సాంకేతికతలను ఆవిష్కరిస్తున్నారు. ప్రొపల్షన్ సిస్టమ్స్ నుంచి శాటిలైట్ ప్లాట్‌ఫారమ్‌ల వరకు, మన యువత గతంలో ఊహించని రంగాలలో పనిచేస్తోంది" అని అన్నారు. ఇస్రో విజయాలు ఎంతోమంది పిల్లలకు శాస్త్రవేత్తలు కావాలనే స్ఫూర్తిని ఇస్తున్నాయని చెప్పారు. 2023లో ఇదే రోజున చంద్రయాన్3 విక్రమ్ ల్యాండర్ చంద్రుడి దక్షిణ ధ్రువంపై విజయవంతంగా దిగిన చారిత్రక ఘట్టానికి గుర్తుగా ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవంగా జరుపుకుంటున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది "వికసిత భారత్ దిశగా: ఆవిష్కరణ, సహకారం, ప్రపంచ అంతరిక్ష నాయకత్వం" అనే థీమ్‌తో వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఇస్రో చైర్మన్ డాక్టర్ వి. నారాయణన్ మాట్లాడుతూ, దేశ అంతరిక్ష పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడానికి ఆవిష్కరణలు, భాగస్వామ్యాలు ఎంతో అవసరమని పిలుపునిచ్చారు.

# దేశంలో 8.7 కోట్ల మంది యువత ఖాళీ

దేశంలో 15 నుంచి 29 ఏళ్ల మధ్య వయసున్న సుమారు 8.7 కోట్ల మంది యువత ప్రస్తుతం చదువుకోవడం, ఉద్యోగం చేయడం లేదా ఏదైనా నైపుణ్య శిక్షణ తీసుకోవడం వంటివి ఏమీ చేయకుండా ఖాళీగా ఉన్నారని నీతి ఆయోగ్ తన తాజా నివేదికలో వెల్లడించింది. ఇటువంటి యువతను 'నీట్' కేటగిరీ కింద వర్గీకరించింది. 'రీఇమైజినింగ్ స్కిల్లింగ్ ఫర్ వికసిత్ భారత్ @2047' పేరిట విడుదల చేసిన ఈ నివేదిక, దేశంలోని యువత ఉపాధి, నైపుణ్యాల పరిస్థితిపై కీలక విషయాలను బయటపెట్టింది. 2021 నాటి నేషనల్ శాంపిల్ సర్వే (ఎన్‌ఎస్‌ఎస్) డేటా ఆధారంగా ఈ నివేదికను రూపొందించారు. దీని ప్రకారం, 'నీట్' వర్గంలోని యువతలో దాదాపు 88 శాతం మంది గృహ సంబంధిత పనుల్లో నిమగ్నమై ఉన్నారు. డిగ్రీ పూర్తి చేసిన వారిలో కేవలం 8.25 శాతం మంది మాత్రమే తమ విద్యార్హతకు తగిన ఉద్యోగాల్లో స్థిరపడుతున్నారని నివేదిక పేర్కొంది. ప్రాక్టికల్ అనుభవం, పరిశ్రమల అవసరాలకు తగ్గ శిక్షణ కొరవడటమే ఈ పరిస్థితికి ప్రధాన కారణంగా గుర్తించింది. ఈ సమస్యను అధిగమించేందుకు నీతి ఆయోగ్ పలు కీలక సూచనలు చేసింది. దేశంలోని వర్క్‌ఫోర్స్‌ను పాఠశాల విద్యార్థులు, ఉన్నత విద్య, ఫార్మల్, ఇన్‌ఫార్మల్ వర్కర్లు, 'నీట్' యువత, మహిళలు అనే ఐదు విభాగాలుగా విభజించింది. ముఖ్యంగా 'నీట్' యువత, మహిళలకు సరసమైన లేదా రాయితీలతో కూడిన నైపుణ్య శిక్షణ, ఆర్థిక సహాయం అందించాలని సిఫారసు చేసింది.

# జపాన్‌లో మళ్లీ భూకంపం.. వణికిన రాజధాని టోక్యో

- **జపాన్‌ను మరోసారి కుదిపేసిన భూకంపం**
- **టోక్యో సహా తూర్పు ప్రాంతాల్లో 5.9 తీవ్రతతో ప్రకంపనలు**
- **సునామీ హెచ్చరికలు లేవన్న అధికారులు**
- **నిలిచిపోయిన రైళ్ల రాకపోకలు**
- **నెల రోజుల క్రితమే కుమామోటోలో భారీ భూకంపం**



జపాన్‌లో వరుస భూకంపాలు ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నాయి. నెల రోజుల వ్యవధిలోనే మరోసారి అక్కడ భూమి కంపించింది. ఈరోజు తెల్లవారుజామున తూర్పు జపాన్‌లో సంభవించిన ఈ భూకంపం రిక్టర్ స్కేలుపై 5.9 తీవ్రతతో నమోదైంది. రాజధాని టోక్యోలోనూ దీని ప్రభావం స్పష్టంగా కనిపించడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. అయితే, అధికారులు సునామీ హెచ్చరికలు జారీ చేయకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. దక్షిణ ఇబరాకి ప్రిఫెక్చర్ కేంద్రంగా, భూమికి సుమారు 70 నుంచి 78 కిలోమీటర్ల లోతులో ఈ భూకంపం సంభవించినట్లు జపాన్ వాతావరణ సంస్థ (జేఎంఏ) వెల్లడించింది. దీని తీవ్రతను జేఎంఏ 5.9గా నమోదు చేయగా, యూఎస్ జియోలాజికల్ సర్వే, జర్మన్ జీఎఫ్‌జడ్ సంస్థలు 5.8గా పేర్కొన్నాయి. భూకంప ప్రకంపనల ధాటికి భవనాలు బలంగా ఊగిపోయాయి. ఈ ఘటనలో ఇబరాకి, చిబా, సైతామా ప్రిఫెక్చర్‌లలో పలువురు గాయపడినట్లు తెలిసింది. భూకంపం కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. టోక్యో నరిటా విమానాశ్రయం మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ రైళ్లతో పాటు ఈశాన్య ప్రాంతాలకు వెళ్లే కొన్ని లోకల్ రైళ్ల రాకపోకల్లో జాప్యం జరిగింది. ఈ ఘటనపై ప్రధాని సనాయ్ తకైచి తక్షణమే స్పందించారు. నష్టాన్ని అంచనా వేసేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు. ప్రజలు ఆందోళన చెందవద్దని, ధైర్యంగా ఉండాలని ఆమె కోరారు. గత నెలలో క్యుషులోని కుమామోటోలో 7.1 తీవ్రతతో సంభవించిన శక్తివంతమైన భూకంపం పెను విధ్వంసం సృష్టించిన విషయం తెలిసిందే. ఆ ప్రమాదంలో 38 మంది మరణించగా, 360 మందికి పైగా గాయపడ్డారు. అలాగే వేలాది ఇళ్లు ధ్వంసమయ్యాయి.

# కొండా సురేఖపై అధిష్ఠానానికి నివేదిక

హైదరాబాద్: పార్టీకి వ్యతిరేకంగా మంత్రి కొండా సురేఖ వ్యవహారశైలి ఉందని.. వివాదానికి మరింత ఆజ్యం పోసేలా ఆమె వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ అధిష్ఠానానికి పీసీసీ ఆదివారం తాజా నివేదిక పంపినట్లు సమాచారం. సీఎం రేవంత్‌రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై మంత్రి కుమార్తె సుస్మిత అసత్య ఆరోపణలు చేస్తే వాటిని సురేఖ సమర్థించడాన్ని కొందరు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తప్పుపట్టిన నేపథ్యంలో....'ఇది తనపై జరుగుతున్న కుట్ర' అని ఆమె లేఖ రాయడంతో వివాదం మరింత ముదిరింది. ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేసేలా సుస్మిత మాట్లాడినా కొండా సురేఖ కనీసం ఖండించకపోగా, తనపైనే కాంగ్రెస్‌లో కుట్ర చేస్తున్నారని పార్టీ నేతలపై మరోసారి అభాండాలు వేయడం సరికాదని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(పీసీసీ), పార్టీ క్రమశిక్షణ వ్యవహారాల కమిటీ(డీఏసీ) గట్టిగా భావిస్తున్నాయి. ఇదే విషయాన్ని ఏఐసీసీకి, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌కు పీసీసీ తాజాగా వివరించింది. ఇటు పీసీసీ నివేదికలు, ఎమ్మెల్యేల మీడియా సమావేశాలు, కొండా సురేఖ డీఏసీకి పంపిన లేఖలపై ఏఐసీసీ పెద్దలు అంతర్గత విచారణ చేస్తున్నారు.

# రఘునాథపల్లి మండల మున్నూరు కాపు నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక



రఘునాథపల్లి, ప్రజాస్ఫూర్తి : రఘునాథపల్లి మండల మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. జిల్లా అధ్యక్షుడు నల్గొండ మహేందర్ గారి అధ్యక్షతన నిర్వహించిన మండల మున్నూరు కాపు సంఘ ముఖ్య సమావేశంలో మండలంలోని మున్నూరు కాపు బంధువులందరి సమక్షంలో రఘునాథపల్లి గ్రామానికి చెందిన గంద్ర నవీన్ గారిని అధ్యక్షులుగా ఉపాధ్యక్షులు గా ఆకుల శ్రీనివాస్, ఎలిశెట్టి రమేష్, ప్రధాన కార్యదర్శి అంగిరేకుల సారయ్య, కోశాధికారి పర్వత యుగేందర్ గారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు నల్గొండ మహేందర్ మాట్లాడుతూ మండలంలో మున్నూరు కాపు కులస్తులందరినీ ఏకం చేస్తూ, సంఘ బలోపేతానికి మరియు కుల బాంధవుల సంక్షేమానికి నూతన కమిటీ నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షించారు.అనంతరం నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు గంద్ర నవీన్ మరియు కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ. తమపై నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించిన జిల్లా నాయకత్వానికి, మండల మున్నూరు కాపు పెద్దలకు, సోదరులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మున్నూరు కాపు సంఘం అభివృద్ధికి, సభ్యుల సంక్షేమానికి తమవంతు శక్తివంచన లేకుండా పనిచేస్తామని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో మండల మున్నూరు కాపు నాయకులు, వివిధ గ్రామాల ప్రతినిధులు, యువజన సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రశాంతంగా టీ.ఆర్.ఐ.ఇ.ఎస్ అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల పోస్టులకు పరీక్ష

జనగామ,ప్రజాస్ఫూర్తి : కొడకండ్ల మం డలంలోని టీఆర్ఐఈఎస్ లో ఖాళీగా ఉన్న 6 గెస్ట్ ఫ్యాకల్టీ, 3 ఔట్‌సోర్సింగ్ నాన్ టీ చింగ్ పోస్టులతో పాటు అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో 3 పోస్టుల భర్తీకి ఆది వారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాల యంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో రాత పరీక్ష నిర్వహించారు.జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పర్యవేక్షణ లో పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ పోస్టు లకు మొత్తంగా 172 దరఖాస్తులు రా గా, 133 మంది అభ్యర్థులు నియామక పరీక్షకు హాజరయ్యారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోం, విద్యాశాఖ ఏడీ శ్రీనివాస్, ఉపాధి శాఖ అధికారి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లందు రైల్వే స్టేషన్‌ను పునరుద్ధరించాలి



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: సింగరేణి చరిత్రలో ప్రత్యేక స్థానం ఉన్న ఇల్లందు పట్టణానికి రైల్వే సౌకర్యాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ కంచర్ల శ్రీనివాసరావు చేపట్టిన నిరాహారదీక్షకు మద్దతు పెరుగుతోంది. గత రెండు రోజులుగా కొనసాగుతున్న నిరాహారదీక్ష శిబిరాన్ని ఆదివారం తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ ఇల్లందు నియోజకవర్గ ఇన్‌చార్జి వాసం రామకృష్ణదొర సందర్శించి సంఘీభావం తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు సింగరేణి సంస్థ స్పందించి ఇల్లందు నుంచి డోర్నకల్ వరకు ప్యాసింజర్ రైలును వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. ఇల్లందు పాసి కుల సంఘం నాయకులు కూడా నిరాహారదీక్షకు మద్దతు ప్రకటించారు. సంఘం అధ్యక్షుడు రాంలాల్ పాసి, ఉపాధ్యక్షుడు ఆనంద్ పాసి, కిషన్ పాసి, నందు పాసి, కమల్ పాసి తదితరులు పాల్గొని శ్రీనివాసరావుకు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో మనోజ్, వినయ్, చిట్టి తదితరులు పాల్గొన్నారు.

# కొత్తగూడెంలో నేత్ర పర్వంగా శ్రావణ మాస పోచమ్మ తల్లి బోనాల జాతర

* **ఆలయ ధర్మకర్త రాజనర్సు ఆధ్వర్యంలో ఘన ఏర్పాట్లు**



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం పట్టణంలో శ్రావణ మాస బోనాల జాతరను అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రతిఏటా ఆనవాయితీగా వస్తున్న ఈ వేడుకను శ్రీశ్రీశ్రీ పోచమ్మ తల్లి దేవస్థానం ఆధ్వర్యంలో కన్నులపండువగా జరిపించారు. ఆలయ ధర్మకర్త పల్లా రాజనర్సు ఈ కార్యక్రమాన్ని దగ్గరుండి పరవేక్షిస్తూ విజయవంతం నిర్వహించారు. ఈ జాతరలో భాగంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన రథంపై కొలువుదీర్చి పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపులో కళాకారుల డప్పు వాయిద్యాలు, కోలాట నృత్యాలు పల్లె సంస్కృతిని తలపించాయి. అమ్మవారి వివిధ రకాల వేషధారణలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. మహిళలు ఎంతో భక్తితో శిరస్సుపై బోనాలు ధరించి ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి తొలుత బోనాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ జాతరతో కొత్తగూడెం పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు .

# రవాణా రంగ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

: **పోతినేని**




ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రభుత్వం రవాణా రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు డిమాండ్ చేశారు. ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల సమ్మెకు సిపిఎం సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు చెప్పారు. కొత్తగూడెంలోని మంచికంటి భవన్‌లో రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆటో కార్మికులు, ప్రైవేటు వ్యాను, స్కూల్ వ్యాన్ల బందును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులకు రూ.12 వేల ఆర్థిక సహాయం ఇవ్వాలని, ఆర్టీసీ సంస్థ తరఫున ఎలక్ట్రికల్ ఆటో వాహనాలు నడిపే ప్రయత్నం విరమించుకోవాలని, రాపిడో, ఓలా, ఉబర్ రద్దుచేసి ప్రభుత్వమే యాప్ ద్వారా రాపిడో సంస్థను నడపాలని డిమాండ్ చేశారు. రవాణా శాఖ మంత్రి కార్మిక సంఘాలు చేపట్టిన బంద్ విరమించాలని ప్రకటనకే పరిమితం అయ్యారు తప్ప కార్మిక సంఘాల జేఎసితో ఎందుకు చర్చలు జరపడంలేదని ప్రశ్నించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎజె రమేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి, అన్నవరపు సత్యనారాయణ, కారం పుల్లయ్య, కె బ్రహ్మాచారి, లిక్కి బాలరాజు, రేపాకుల శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు ఎస్ఏ నబి, నిమ్మల వెంకన్న, వంశీ, పిట్టల అర్జున్ తదితరులు పాల్గొన్నారు

## అంగరంగ వైభవంగా
# మెగాస్టార్ పద్మవిభూషణ్ చిరంజీవి జన్మదిన వేడుకలు




ప్రజాస్ఫూర్తి , జన్నారం : జన్నారం పట్టణ కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం పక్కన రాము హోటల్ వద్దా తేది 2308 2026 మెగాస్టార్ చిరంజీవి అన్నయ్య 71 వ జన్మదిన వేడుకలు అభిమానులు కన్నుల పండుగగా నిర్వహించడం జరిగింది,ఈ కార్యక్రమంలో మెగాస్టార్ చిరంజీవి వీరాభిమాని లింగంపెల్లి రాజలింగం మాట్లాడుతూ చిరంజీవి తీసిన ప్రతీ సినిమా అన్నీ వర్గాల ప్రజలకు ఉపయోగపడే విదంగా మెసేజ్ లు ఉంటాయని అయన డాన్స్ లు , ఫైట్స్ , యాక్షన్ , అన్నీ కళలున్నా నవరస కళాకారుడని కొనియాడారు,అంతేకాకుండా ఈ భారతదేశమే గర్వించదగ్గ నటులని గుర్తు చేశారు,చిరంజీవి గారి ఆరాధన సినిమా షూటింగ్ జరుగుతున్నా సమయంలోఆ సినిమా గ్రేట్ డైరెక్టర్ భారతీరాజాగారు ఒక గొప్ప మాట ప్రస్తావించారు , ఒక కమలాసన్ ఒక ఇద్దరు ఈజీకొల్ట్ చిరంజీవని వాక్యాణించారనీ రాజలింగం తెలిపారు,ఈ బర్త్డే వేడుకల్లో చిరంజీవి అభినందనలు వీరాచారి,లావుడ్యా రమేష్,కొండూకూరి ప్రభుదాస్,JK నాయక్,కండ్ల శ్రవణ్ కుమార్,మామిడి విజేయ్,కొండపల్లి మహేష్,మర్శకోలా శ్రవణ్,కొండూకూరి రాజు,దేవి శ్రావణ్ కుమార్,కొండూకూరి సురేష్,జంగిలి సురేష్,తదితరులు పాల్గొన్నారు,

# టైగర్ జోన్ రద్దు చేయాలి–ఏకో సెన్సిటివ్ జోన్ ఎత్తివేయాలి

* **రిలే నిరాహారదీక్ష చేపట్టిన సామాజిక పోరాట సమితి అధ్యక్షుడు భూమాచారి**




ప్రజాస్ఫూర్తి , జన్నారం: జన్నారం డివిజన్లోని కవ్వాల్ టైగర్ జోన్ రద్దు చేయాలని ఏకో సెన్సిటివ్ జోన్ ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ సామాజిక పోరాట సమితి మండల అధ్యక్షుడు శ్రీరాముల భూమాచారి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు.ఈ రిలే నిరాహారదీక్ష కు మండల వర్తక వ్యాపారులు, పలు పార్టీల నాయకులు,ప్రజాప్రతినిధులు, కుల సంఘాలు, పలువురు సర్పంచులు మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా భూమాచారి మాట్లాడుతూ కవ్వాల్ టైగర్ జోన్ ఆంక్షలు ఎత్తివేయడం కాదు పూర్తిగా కవ్వాల్ టైగర్ జోన్ ను ఎత్తివేయాలని అసెంబ్లీలో తీర్మానం చేయాలని, ఎకో సెన్సిటివ్ జోన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. టైగర్ జోన్ పేరుతో జన్నారం రేంజిలో సస్పెండ్ చేసిన అటవీ శాఖ ఉద్యోగులను విధుల్లో చేర్చుకొని సర్వీసులో ఎలాంటి మరకలు లేకుండా పూర్తి జీతం చెల్లించాలని కోరారు. గుడిహత్నూర్ నుండి జన్నారం మీదుగా కరీంనగర్ వరకు నాలుగు వరుసల జాతీయ రహదారిని వెంటనే ఏర్పాటు చేయాలని, మాజీ సర్పంచ్ జక్కు భూమేష్ పై అటవీశాఖ అధికారులు పెట్టిన కేసులు బేషరతుగా ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. టైగర్ జోన్ ఎత్తివేసే వరకు రిలే నిరాహార దీక్ష కొనసాగుతుందని, 41 రోజుల తర్వాత టైగర్ జోన్ ఎత్తివేయకపోతే ఆమరణ నిరాహారదీక్ష చేపడతారని హెచ్చరించారు. ఈ రిలే నిరాహార దీక్షకు మండలవాసులు, అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు.

# దామన్నతో నాలుగు దశాబ్దాల అనుబంధం

* **కొప్పుల వేణారెడ్డి భావోద్వేగం**



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: దామన్నకే తొలి నివాళి, ఆపై గృహప్రవేశం... తనకు అత్యంత ఆత్మీయుడైన స్వర్గీయ దామన్న చిత్రపటానికి ముందుగా నివాళులర్పించిన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, అనంతరం నూతన గృహప్రవేశం చేశారు. దామన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి నూతన గృహంలోకి అడుగుపెట్టారు. ఈ సందర్భంగా కొప్పుల వేణారెడ్డి మాట్లాడుతూ దాదాపు 40 ఏళ్లుగా స్వర్గీయ దామన్న తనను సొంత సోదరుల్లో ఒకరిగా భావించి ఆప్యాయంగా చూసుకున్నారని గుర్తు చేసుకున్నారు. దామన్నతో తనకున్న అనుబంధం ఎంతో ప్రత్యేకమైనదని, ఆయన చూపిన ప్రేమాభిమానాలను ఎప్పటికీ మరిచిపోలేనని భావోద్వేగంతో పేర్కొన్నారు. నూతన గృహప్రవేశ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, ఆత్మీయులు, అభిమానులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.సాయి బాబా 101వ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు , భజనలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కొప్పుల వేణారెడ్డిని అభినందించి ఆయన కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బైరు శైలేందర్ , ఎల్గూరి ఇందిరా వీరయ్య గౌడ్ కుందమల్ల శేఖర్, అబ్దుల్ కరీం, కేశవులు, ఎల్గూరి వెంకటేశం, పందిరి మల్లేష్, శ్రీనివాస్, వెన్న ఉపేందర్, రాపర్తి నాగరాజు, గౌస్ సాజిద్ , రామసాని రమేష్ బొల్లం వెంకన్న, బైరు నాగరాజు నంద్యాల శ్రీనివాస్ రెడ్డి, నంద్యాల బిక్షం రెడ్డి, రజనీకాంత్ రెడ్డి, గార్లపాటి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు

# 'గూడెం'లో పాస్‌పోర్ట్ సేవా కేంద్రం

* **ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణంలోని హెడ్ పోస్టాఫీసులో త్వరలోనే పోస్ట్ ఆఫీస్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రం ఏర్పాటు కానుందని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. కొత్తగూడెంలో పాస్‌పోర్ట్ కేంద్రం ఏర్పాటు చేయాలని తాను కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు, ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయానికి సమర్పించిన లేఖలు, సంప్రదింపులపై అధికారులు సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. ఈ మేరకు హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారి అనుమతితో కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పీఎస్పీ డివిజన్ అండర్ సెక్రటరీకి పరిశీలన నిమిత్తం ప్రతిపాదనలు పంపించినట్లు వివరించారు. కొత్తగూడెం ప్రధాన పారిశ్రామిక, గనుల, వాణిజ్య కేంద్రంగా విస్తరించి ఉందని, ఇక్కడి నుంచి విదేశాలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో ఉన్నారని చెప్పారు. ప్రస్తుతం పాస్‌పోర్ట్ సేవల కోసం 75 కిలోమీటర్ల దూరంలోని ఖమ్మం, మహబూబాబాద్ కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోందని గుర్తుచేశారు. దీనివల్ల వృద్ధులు, మహిళలు, విద్యార్థులు, ప్రజలు సమయం, డబ్బు వృథా చేసుకుంటూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జిల్లాల పునర్వ్యవస్థీకరణ అనంతరం కొత్తగూడెం ప్రత్యేక జిల్లా కేంద్రంగా మారినందున ఇక్కడే పూర్తిస్థాయి కేంద్రం అవసరమని స్పష్టం చేశారు. ఈ సమస్యను కేంద్ర మంత్రిత్వ శాఖ దృష్టికి తీసుకెళ్లి అనుమతులు సాధించేందుకు ప్రత్యేక చొరవ తీసుకున్నామని తెలిపారు. త్వరలోనే కేంద్రం నుంచి అధికారిక ఆదేశాలు వెలువడి పాస్‌పోర్ట్ సేవా కేంద్రం అందుబాటులోకి రానుందని కూనంనేని తెలిపారు.



# నల్లగొండ పట్టణాన్ని సూపర్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతా

* **రాష్ట్ర రోడ్లు,భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**

ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : నల్లగొండ పట్టణాన్ని సూపర్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడంతో పాటు, నల్లగొండ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన జీవిత లక్ష్యమని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండ పట్టణంలోని నల్లగొండ క్లబ్‌లో రూ.2 కోట్లతో నూతనంగా నిర్మించిన గెస్ట్ రూమ్, కాన్ఫరెన్స్ హాల్ ను నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డితో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నల్లగొండ క్లబ్‌లో మంచి వాతావరణం ఉందని, పట్టణ ప్రజలకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. క్లబ్ అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. నల్లగొండ పట్టణ ప్రజలకు 24 గంటల తాగునీరు అందించేందుకు రూ.125 కోట్లతో పనులు చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, ఆర్డీవో వై.అశోక్ రెడ్డి ,క్లబ్ అధ్యక్షుడు గోలి అమరేందర్ రెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస రెడ్డి, మాజీ జెడ్పిటిసి గుమ్ముల మోహన్ రెడ్డి,స్థానిక కార్పొరేటర్ ఏదుళ్ళ శ్రీధర్ రెడ్డి, గుమ్మల జానకి రెడ్డి ,క్లబ్ సెక్రటరీ చల్ల వెంకటరమణ, కాసర్ల వెంకటరెడ్డి, క్లబ్ మెంబర్స్ డాక్టర్ పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

# చిట్యాలలో రిపోర్టర్‌పై దాడి కేసు

**: మరో ఇద్దరు నిందితుల లొంగుబాటు**

* **హోండా సిటీ కారు స్వాధీనం**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజా స్ఫూర్తి : చిట్యాలలో ఆర్‌బీ న్యూస్ రిపోర్టర్ పుల్ల రవీందర్‌పై దాడి కేసులో పరారీలో ఉన్న మరో ఇద్దరు ప్రధాన నిందితులు ఆదివారం కాటారం డీఎస్పీ ఎ. సూర్యనారాయణ ఎదుట లొంగిపోయారు. నిందితుల నుంచి దాడికి ఉపయోగించిన చాక్లెట్ రంగు హోండా సిటీ కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 16న రాత్రి రవీందర్ ఇంట్లోకి చొరబడిన కొందరు వ్యక్తులు ఆయనపై దాడి చేయడంతోపాటు ఇంట్లోని సామగ్రిని ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. ఘటన అనంతరం పరారైన నిందితుల కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. ఈ కేసులో మొక్కిరాల మధువంశీ కృష్ణ, ఎండీ ఆరిఫ్ ఆదివారం మధ్యాహ్నం డీఎస్పీ ఎదుట లొంగిపోయారు. వారి నుంచి టిఎస్ 07ఈవి9852 నంబరు గల హోండా సిటీ కారును స్వాధీనం చేసుకున్నారు. కాగా, ఈ కేసులో ఇప్పటికే బొజ్జం వేణు, మెంగని నటరాజ్, మొక్కిరాల ప్రణయ్, గోలి అఖిల్‌లను ఈ నెల 19న అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల గాలింపు ముమ్మరం కావడంతో మధువంశీ కృష్ణ, ఆరిఫ్‌లు లొంగిపోయినట్లు డీఎస్పీ తెలిపారు.నిందితులను విచారించిన అనంతరం కోర్టులో హాజరుపరిచినట్లు వెల్లడించారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని భౌతిక దాడులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ ఎ. సూర్యనారాయణ హెచ్చరించారు.

# పోగొట్టుకున్న పర్స్, సెల్ ఫోన్ అప్పగింత



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: జనగామ కు చెందిన బోనగిరి పూలమ్మ నర్మట వెళ్ళుటకు ఆర్టీసీ బస్టాండ్ లో వేచి ఉండే సమయంలో తన పర్సు పోయిందని ఆదివారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో జనగామ చౌరస్తాలో ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ఎం. కుమార్ ని సంప్రదించగా తను కంట్రోల్ రూమ్ లోని బస్టాండ్ కెమెరాలు చెక్ చేసి కవర్ ని గుర్తుపట్టి అందులో ఉన్న డబ్బులున్న పర్సు ఇంటి తాళాలు సెల్ ఫోన్ అప్పగించారు. పోగొట్టుకున్న వస్తువులను త్వరగా అప్పగించినందుకు బాధితురాలు, జనగామ పోలీసు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## బుల్లెట్ ట్రైన్ కొరకు రిలే నిరాహార దీక్షలో అడ్తి అసోసియేషన్ వ్యాపారులు



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట:జాతీయ రహదారి 65 కు సమాంతరంగా రైల్వే లైను, రైల్వే కారిడార్ సాధన కోసం రైల్వే సాధన సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న పోరాటానికి తమ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ అడ్తి అసోసియేషన్ అధ్యక్షులు తూడి విద్యాసాగర్ అన్నారు. ఆదివారం రైతు బజార్ వద్ద రైల్వే సాధన సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న దీక్షా శిబిరంలో వారు ఒక రోజు రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూర్యాపేట ప్రముఖ వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చెందాలంటే ఇక్కడికి రైల్వే లైన్ మార్గం వచ్చినట్లయితే వ్యాపార రంగంలో మరింత అభివృద్ధి జరుగుతుందని వారు అన్నారు. పట్టణంలోని గాంధి విగ్రహం నుండి రైతుబజార్ వరకు ర్యాలి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గొట్టిముక్కుల రవి కుమార్, కోశాధికారి ఉప్పల నరసింహారావు, ఉపాధ్యక్షులు సోమ సోమేశ్వరరావు,గౌరవ సలహా దారులు రంగినేని వెంకటేశ్వరరావు, ఈగ వెంకటేశ్వర్లు, కందిమల్ల సత్యనారాయణ, శ్రీరంగం నరసింహారావు, గుండా సుధాకర్, ఉప్పల చంద్ర వెంకన్న, తోట బిక్షం, సిరా మహేందర్ , బజ్జూరి శ్రీనివాస్, మహంకాళి ఉపేందర్, నరేంద్రుని నర్సింగ్, తొగరు కామంచయ్య, బోనగిరి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## 14,15వ వార్డుల్లో పర్యటించిన మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: మెదక్ పట్టణంలోని 14, 15వ వార్డుల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ ఆదివారం పర్యటించి స్థానిక సమస్యలను పరిశీలించారు. వార్డుల్లో పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలకు సంబంధించిన సమస్యలను గుర్తించి, వాటిని వెంటనే పరిష్కరించాలని విద్యుత్ శాఖ సిబ్బందికి ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనతో పాటు సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. ప్రజలు తమ సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. వార్డు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని దొంతి నరేష్ గౌడ్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తపస్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం





ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నల్లగొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆగస్టు 26వ తేదీన నల్గొండ పట్టణ కేంద్రంలోని రత్న ఫంక్షన్ హాల్ నందు ఉదయం 10:00 గంటలకి జిల్లా స్థాయిలో "గురువందన కార్యక్రమం" నిర్వహించడం జరుగుతుంది. జ్ఞాన సంపదకు నిలయమైన గురువు గొప్పతనాన్ని,గురువు ఔన్నత్యాన్ని చాటడానికి తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ గురువందనం కార్యక్రమంలో జిల్లాలో అత్యుత్తమ పనితీరు కనపరుస్తున్న గురువులను సంఘాలకు అతీతంగా ప్రభుత్వ / స్థానిక సంస్థల పాఠశాలలు,మోడల్ స్కూల్స్,రెసిడెన్షియల్ స్కూల్స్ మరియు కేజీబీవీ పాఠశాలల నుండి ఆయా మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపల్స్,ఎస్ ఓ , మండల బాధ్యుల ఉమ్మడి సలహాలు సూచనలతో ఎంపిక చేసి సన్మానించారు. ఇట్టి మహోన్నత కార్యక్రమంనకు ఉపాధ్యాయులుగా మనందరం హాజరై గురువులకు వందనాలు పలుకుదాము.ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏ.వి.యన్.రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేస్తున్నారు.కావున ఈ కార్యక్రమానికి నల్గొండ జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు ఎక్కువ సంఖ్యలో హాజరు కాగలరని జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బత్తిని భాస్కర్ గౌడ్,రేణికుంట్ల రాజశేఖర్ తెలియజేశారు .

## పద్మశాలిలు రాజకీయాలలో రాణించాలి



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా సమాజాభివృద్ధికి బాటలు వేయవచ్చని తెలుగు అకాడమీ చైర్మన్ కూరపాటి వెంకటనారాయణ అన్నారు. ఆదివారం పట్టణంలోని పద్మశాలి భవన్ లో పద్మశాలి సేవా సమాజ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పురస్కారాలు, నోట్ పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యకు మాత్రమే సమాజాన్ని మార్చగల శక్తి వుందని పేర్కొన్నారు. పద్మశాలిలు రాజకీయాల్లోకి మరింతగా రావాలని, అందుకు అన్ని రాజకీయ పార్టీలు తగిన అవకాశాలు కల్పించాలని కోరారు. తాను పద్మశాలి కావడం వల్లే తెలుగు అకాడమీ చైర్మన్‌గా అవకాశం లభించిందని పేర్కొంటూ, తెలుగు అకాడమీ తరపున ఇంటర్మీడియట్ తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రూ.10 వేల నగదు పురస్కారం అందజేస్తున్నట్లు వెల్లడించారు. సూర్యాపేటతో తనకు ఎంతో అనుబంధం ఉందని, మారోజు వీరన్న వంటి ప్రముఖులను కలిసిన సందర్భాలను గుర్తు చేసుకున్నారు. సూర్యాపేట కొంతకాలంగా అభివృద్ధిలో నిర్లక్ష్యానికి గురైందని వ్యాఖ్యానించారు. తెలంగాణ రాష్ట్రంలో జనాభా పరంగా ఐదవ స్థానంలో ఉన్న పద్మశాలిలు ఐకమత్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సభాధ్యక్షులు పెండం చంద్రశేఖర్, విశిష్ట అతిథి ప్రొఫెసర్ రుద్ర సాయి బాబా, ఉపాధ్యక్షులు యలగందుల లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి పెండం వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి చల్లమల్ల వెంకటరమణ, కోశాధికారి పెండెం కృష్ణ కుమార్, సన్మాన గ్రహీతలు కందలగడ్డ మల్లికార్జునరావు, కొంపల్లి అజయ్ కుమార్, గాజుల సత్యనారాయణ, సుద్దాల భారతి తదితరులు పాల్గొన్నారు.

# పెద్ద తండాలో రెచ్చిపోతున్న కేబుల్ దొంగలు

*** పోలీసుల తీరుపై రైతుల ఆగ్రహం**

రేగోడ్, ప్రజాస్ఫూర్తి : రేగోడ్ మండల పరిధిలోని డీఎన్‌టీ పెద్ద తండాలో దొంగలు రెచ్చిపోయారు. వ్యవసాయాన్ని నమ్ముకుని జీవిస్తున్న రైతుల పొట్ట కొట్టేలా అర్ధరాత్రి సమయంలో బోర్లకు అమర్చిన కాపర్ కేబుల్ వైర్లను గుర్తుతెలియని దొంగలు కత్తిరించి ఎత్తుకెళ్లారు. ఒకరిద్దరు కాదు, ఏకంగా సుమారు 21 మంది రైతుల బోర్ల వైర్లు మాయం కావడంతో తండాలో ఒక్కసారిగా ఆందోళనకర వాతావరణం నెలకొంది. ప్రస్తుతం పంటల సాగుకు సంబంధించిన పెట్టుబడుల సీజన్ నడుస్తోంది. ఈ సమయంలో వేలాది రూపాయల విలువ చేసే కాపర్ కేబుల్ వైర్లు చోరీకి గురికావడంతో రైతులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఉన్నఫళంగా కొత్త వైర్లు కొనుగోలు చేయడానికి చేతిలో డబ్బులు లేక, అధికారుల చుట్టూ తిరగలేక దిక్కుతోచని స్థితిలో పడిపోయారు.

*** పోలీసుల ఉదాసీన వైఖరిపై విమర్శలు:**

ఘటన జరిగి సుమారు నాలుగు రోజులు గడుస్తున్నా, స్థానిక పోలీసులు ఇప్పటివరకు కనీస స్పందన చూపకపోవడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేవలం డీఎన్‌టీ పెద్ద తండాలోనే కాకుండా, గతంలోనూ రేగోడ్ కేంద్రంలో మరియు శివారు ప్రాంతాల్లో వరుసగా కేబుల్ వైర్ల దొంగతనాలు జరిగాయి. అయితే, ఇప్పటివరకు ఏ ఒక్క కేసుకు సంబంధించి కూడా దొంగలను పట్టుకున్న దాఖలాలు లేవు, పోయిన వైర్లు రికవరీ కాలేదు."గతంలో దొంగతనాలు జరిగితేనే పట్టించుకోని పోలీసులు, ఇప్పుడు మా వైర్లు రికవరీ చేస్తారనే నమ్మకం ఏముంది?" అంటూ రైతులు పోలీసుల పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, కేబుల్ దొంగల ముఠాను పట్టుకుని, దొంగిలించబడిన వైర్లను రికవరీ చేయాలని... నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని తండా రైతులు డిమాండ్ చేస్తున్నారు. పోలీసుల నిర్లక్ష్య వైఖరిని ఇకనైనా వీడి, రాత్రి వేళల్లో గస్తీ ముమ్మరం చేయాలని రైతాంగం కోరుతోంది.

## 200 మందికి పైగా ఆయిల్‌పామ్ రైతులతో జిల్లా స్థాయి సమావేశం

*** రైతుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ముందుకు సాగాలి**

**: పొల్నేని రాజేశ్వర్‌రావు**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజా స్ఫూర్తి : జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఆయిల్‌పామ్ రైతుల సంక్షేమ సహకార సంఘం ఆధ్వర్యంలో మహదేవపూర్ మండలం అంబటిపల్లిలో శనివారం జిల్లా స్థాయి రైతుల సమావేశం నిర్వహించారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి 200 మందికి పైగా ఆయిల్‌పామ్ రైతులు హాజరయ్యారు. ఆతిథ్య రైతు లింగంపల్లి శ్రీనివాసరావుకు చెందిన 40 ఎకరాల ఆయిల్‌పామ్ తోటలో సమావేశం జరిగింది.ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న నీటి సమస్యలు, ఎరువులు, పంట సంరక్షణ, గెలల కోత, రవాణా, యంత్ర పరికరాల కొరత, ఆధునిక సాగు పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం, ప్రభుత్వ పథకాలపై విస్తృతంగా చర్చించారు. రైతులకు ఉపయోగపడే యంత్రాలు, ఎరువులు, పంట సంరక్షణ ఉత్పత్తులు, నీటిపారుదల సాంకేతికతను అందించే సంస్థలను రైతులకు చేరువ చేయాలని నిర్ణయించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు పొల్నేని రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ.. రైతుల సమస్యలను సమిష్టిగా పరిష్కరించేందుకు సంఘాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి మండలం, గ్రామంలోని ఆయిల్‌పామ్ రైతులను సంఘంతో అనుసంధానం చేసి వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. 'రైతుల ఐక్యతే మన బలం. అందరం ఒకే వేదికపై నిలబడి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి' అని పిలుపునిచ్చారు. మండల స్థాయి కమిటీలు లేని ప్రాంతాల్లో రైతులతో సమన్వయం చేసుకుని కమిటీలను ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. రైతుల నుంచి వచ్చిన సూచనల ఆధారంగా భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు జిల్లా కమిటీ తెలిపింది.కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు నల్ల సుదర్శన్‌రెడ్డి, పినపాక రాజారెడ్డి, పాల్వంచి రవీందర్, ఎర్రబెల్లి రవీందర్‌రావు, ప్రధాన కార్యదర్శి ఎంబాడి అనిల్‌కుమార్, కార్యదర్శులు చిలకాని గోవర్ధన్, ఒడ్డాల తిరుపతి, నందికొండ పాపిరెడ్డి, బూనా మురళి, కంకణాల జనార్ధన్, కోశాధికారి గోలి కృష్ణారెడ్డి, మహిళా కార్యదర్శి బీరవోలు నిర్మలాదేవి, మీడియా, ప్రజా సంబంధాల ప్రతినిధి పొల్నేని వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.సమావేశాన్ని విజయవంతం చేసిన రైతులు, జిల్లా కమిటీ సభ్యులు, మండల ప్రతినిధులు, ఆతిథ్య రైతు లింగంపల్లి శ్రీనివాసరావుకు సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

## అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ప్రవేశాలు

*** సెప్టెంబర్ 9 చివరి గడువు**



ప్రజాస్ఫూర్తి , నల్లగొండ : విద్యను ప్రతి ఒక్కరికీ చేరువ చేయాలనే లక్ష్యంతో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆధునిక అవసరాలకు అనుగుణంగా నూతన కోర్సులు, విద్యా విధానాలను అమలు చేస్తోందని ఎడ్యుకేషన్ ఎక్స్‌టెన్షన్ సెంటర్ నోడల్ అధికారి డాక్టర్ బి. ధర్మ నాయక్ తెలిపారు. ఆదివారం నల్లగొండ రీజినల్ కేంద్రంలో అధ్యయన కేంద్రాల కౌన్సిలర్ల సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ ధర్మ నాయక్ మాట్లాడారు.2026 విద్యా సంవత్సరానికి యూజీ, పీజీ, డిప్లొమా, సర్టిఫికెట్ తదితర కోర్సుల్లో ప్రవేశాలు కొనసాగుతున్నాయని, అర్హులైన విద్యార్థులు సెప్టెంబర్ 9లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివిధ కారణాలతో రెగ్యులర్ విద్యను కొనసాగించలేకపోయిన వారికి ఓపెన్ యూనివర్సిటీ విద్య ఎంతో అనుకూలంగా ఉంటుందని తెలిపారు. ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్ విధానంలో విద్యార్థులు తమకు అనుకూలమైన సమయంలో, సొంత వేగంతో చదువుకునే అవకాశం ఉంటుందన్నారు. యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ గంటా చక్రపాణి ఆధ్వర్యంలో మారుతున్న కాలానికి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు అనుగుణంగా నూతన కోర్సులను రూపొందిస్తున్నట్లు ధర్మ నాయక్ తెలిపారు. టెలికాన్ఫరెన్స్ ద్వారా రిజిస్ట్రార్ ఎల్.వి.కె. రెడ్డి మాట్లాడుతూ ఓపెన్ యూనివర్సిటీలో విద్యను అభ్యసిస్తున్న వారికి చదువుతోపాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికే, టీసిఎస్,ఐకాన్ రామానంద తీర్థ ఇన్‌స్టిట్యూట్, రాశి, విహబ్ వంటి సంస్థలతో ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు గుర్తుచేశారు.ప్రతి విద్యా సంవత్సరంలో నల్లగొండ జిల్లా నుంచి యూజీ, పీజీ అడ్మిషన్లు అత్యధికంగా ఉంటాయని, ఈ ఏడాది కూడా అడ్మిషన్లలో నల్లగొండ జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో రీజినల్ కో ఆర్డినేటర్ డాక్టర్ అనిల్ బొజ్జ, మహిళ డిగ్రీ కళాశాల కోఆర్డినేటర్ రాజారామ్ అధ్యయన కేంద్రాల కౌన్సిలర్లు శ్రీకాంత్, మహేష్ పాల్గొన్నారు.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

*** బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశంలో డిమాండ్**



కూకట్ పల్లి, ప్రజాస్ఫూర్తి : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడంతో పాటు బీసీ వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకోవాలని బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం నిర్వహించిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. బీసీ వర్గాలకు విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందని సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు పేర్కొన్నారు. బీసీ విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించడంతో పాటు, బీసీ కుటుంబాల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. బీసీలకు సంబంధించిన సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని, అర్హులైన వారికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సమావేశంలో తీర్మానించారు. బీసీ వర్గాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి సంఘం తరఫున నిరంతరం కృషి చేస్తామని నాయకులు తెలిపారు.

**నూతన కార్యవర్గం ఏర్పాటు**

సమావేశంలో బీసీ వెల్ఫేర్ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బి. రాజిరాజు, జనరల్ సెక్రటరీగా యు. శివప్రసాద్ తదితరులను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. వైస్ ప్రెసిడెంట్లు, జాయింట్ సెక్రటరీలు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు, ఇతర కార్యవర్గ సభ్యులను కూడా ఎంపిక చేశారు. సంఘాన్ని బలోపేతం చేసి బీసీల హక్కులు, సంక్షేమం కోసం సమష్టిగా పనిచేయాలని నూతన కార్యవర్గ సభ్యులకు నాయకులు సూచించారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు, ఎగ్జిక్యూటివ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఫలారం బండి కార్యక్రమం

కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : బాచుపల్లి రాజీవ్ గాంధీ నగర్‌లో బీజేవైఎం నాయకులు సాయి కృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఫలారం బండి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాధవి, ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులు జే.కే. శేఖర్ యాదవ్ లు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో చక్రధర్, డివిజన్ అధ్యక్షులు నరేంద్ర చౌదరి, ప్రసాద్, రాజు, సుమన్ రావు, సత్య, రవి యాదవ్, ఆర్థిక్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.





## డ్రాగన్ ఫ్రూట్‌తో రైతు ఆదాయానికి కొత్త బాట

**: జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

జనగామ, ప్రజాస్ఫూర్తి : సంప్రదాయ పంటలతో పాటు అధిక విలువ కలిగిన ఉద్యాన పంటలను సాగు చేయడం ద్వారా రైతులు మెరుగైన ఆదాయం పొందవచ్చని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. భూమి స్వభా వం, నీటి లభ్యత, మార్కెట్ డిమాండ్ కు అనుగుణంగా పంటలను ఎంపిక చే సుకోవాలని సూచించారు. జిల్లాలోని నర్మెట్ట మండలం గుంటూరుపల్లి గ్రామ రైతులు పంటల వైవిధ్యంతో ఆదర్శంగా నిలుస్తున్నారు. డ్రాగన్ ఫ్రూట్ ,పత్తి,కంది,టమాటా, వంకాయ, మిరపతో పాటు వివిధ కూరగాయలను సాగు చేస్తూ ఆదాయ మార్గాలను విస్తరించుకుంటు న్నారు. గ్రామానికి చెందిన రైతు మేకల వెలంగన్ రెడ్డి 1.60 హెక్టార్లలో డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తున్నారు. ఎం.ఐ.డి. హెచ్ పథకం కింద ఆయనకు రూ.2.56 లక్షల ఆర్థిక సహాయం అందింది. ఎకరా కు సుమారు రూ.2.40 నుంచి రూ.2.5 0 లక్షల పెట్టుబడితో రూ.3.90 నుంచి రూ.4 లక్షల వరకు నికర ఆదాయం పొందుతున్నట్లు తెలిపారు. మరో రైతు షా బాలరెడ్డి 14 ఎకరాల్లో పత్తి సాగు చేస్తూ మంచి దిగుబడులు సాధిస్తు న్నారు. పత్తితో పాటు కంది సాగు కూ డా రైతులకు తక్కువ పెట్టుబడితో మెరుగైన ఆదాయాన్ని అందిస్తోంది.రైతు లు డ్రిప్ ఇరిగేషన్, శాస్త్రీయ సాగు పద్ధ తులు, సమతుల్య పోషకాల వినియో గం ద్వారా నీటిని పొదుపుగా వినియో గిస్తూ సాగు వ్యయాన్ని తగ్గించుకోవాల ని కలెక్టర్ సూచించారు. పంటల వైవి ధ్యాన్ని పాటిస్తున్న గుంటూరుపల్లి రైతు ల సాగు ఇతర రైతులకు స్ఫూర్తిదాయ కంగా నిలుస్తోంది.

## సమాజ సేవకులు మహంకాళి ప్రణీత్ పుట్టిన రోజు వేడుకలు



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: సమాజ సేవకులు సూర్యాపేట శ్రీ వాసవి సేవాసమితి జిల్లా ఉపాధ్యక్షులు మహంకాళి ప్రణీత్ పుట్టిన రోజు వేడుకలు ఆదివారం జిల్లా కేంద్రంలోనీ సేవాసమితి కార్యాలయం లో సమితి సభ్యులు, మిత్రుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిరుపేదలకు నిత్యవసర సరుకులు అందజేశారు. అనంతరం సేవాసమితి లో సభ్యులుగా చేరిన వారికి గుర్తింపు కార్డులు అందజేశారు. ఈ సందర్భముగా సేవా సమితి జిల్లా అధ్యక్షులు బచ్చు పురుషోత్తం మాట్లాడుతూ మహంకాళి ప్రణీత్ సూర్యాపేట జిల్లా రియల్ ఎస్టేట్ అసోసియేషన్ అధ్యక్షులుగా, ఆర్య వైశ్య సూర్యాపేట జిల్లా ఉపాధ్యక్షులుగా ఉంటూనే నిరుపేదలు, బడుగు బలహీన వర్గాలకు ఎన్నో సేవలు అందించారని కొనియాడారు. తమ సమితి ఎల్లప్పుడూ నిరుపేద ఆర్యవైశ్య కుటుంబాలకు అండగా నిలుస్తుందని, వారి సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాసవి సేవాసమితి నాయకులు గోపారపు రాజు, దేవరశెట్టి నాగరాజు, సోమా ప్రవీణ్ కుమార్, మిరియాల సుధాకర్ రాచకొండ శ్రీనివాస్,బజ్జూరి శ్రీనువాసు, శ్రీరంగం రాము, పోలా లక్ష్మీ నారాయణ, బుక్క రమేష్, తాటిశెట్టి హనుమంత్, మహంకాళి సోమయ్య,తల్లాడ కృష్ణమూర్తి, దేవరశెట్టి దుర్గా ప్రసాద్, చందా రాజశేఖర్,పబ్బా ప్రకాశరావు, దేవరశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## యాదవ సంఘం శ్రీకృష్ణ ఉత్సవ కమిటీ సన్నాహక సమావేశం



జనగామ, ప్రజాస్ఫూర్తి : యాదవ సంఘం శ్రీకృష్ణ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ముత్తయ్య యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని గాయత్రీ ఫంక్షన్ హాల్‌లో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ నాయకులు మాట్లాడుతూ సెప్టెంబర్ 4న జరగనున్న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లు,కార్యాచరణపై చర్చించి నాయకులకు దిశానిర్దేశం చేశారు. ప్రతి గ్రామం, మండలం నుంచి యాదవ బంధువులు పెద్ద ఎత్తున పాల్గొని వేడు కలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో యాదవ సంఘం నాయకులు, యువజన సభ్యులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మేడ్చల్ జిల్లా ఓబిసి మోర్చా కార్యవర్గ సభ్యుడు నారాయణ గౌడ్ కి ఘన సన్మానం



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : మేడ్చల్ జిల్లా ఓ బి సి మోర్చా కార్యవర్గ సభ్యునిగా నియమితులైన నారాయణ గౌడ్ ని ఆదివారం రంగారెడ్డినగర్ లోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అర్బన్ ప్రభారి నందనం దివాకర్, మేడ్చల్ జిల్లా ఓ బి సి మోర్చా అధ్యక్షులు జెకె శేఖర్ యాదవ్ లు పాల్గొని నారాయణగౌడ్ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలుతెలియజేశారు. అనంతరం ఓబీసీ మోర్చా మాజీ అసెంబ్లీ కన్వీనర్ వినోద్ కుమార్ జిల్లా అధ్యక్షులు జెకె శేఖర్ యాదవ్ ని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ లొ కష్టపడి పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. బీసీ నాయకులను రాజకీయంగా ఎదగడానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు మణికంఠ, సంజయ్, కిషోర్, మహేష్ చారి, తదితరులు పాల్గొన్నారు.

## కన్నుల పండుగగా సాహిత్య సామ్రాట్ బాహు సాటే 106వ జయంతి వేడుకలు



ప్రజాస్ఫూర్తి , భైంసా: నిర్మల్ జిల్లాతానూరు మండలంలోని ఉమ్రి గ్రామంలో ఘనంగా సాహిత్య సామ్రాట్ అన్న బహుసాటే గారి జయంతి వేడుకలు నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు పటేల్,మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ సాగర్ బాయ్ రాజన్న, మాజీ ఆత్మ చైర్మన్ పోత రెడ్డి, మాజీ జడ్పీటీసీ ఉత్తం భలేరావు, గైక్వాడ్ గంగాధర్,మాజీ ఎంపీటీసీ పోశెట్టి సినిమా డైరెక్టర్ కొత్తూరు శంకర్,వికాస్ పాటిల్, సాయిచంద్, పూజారి లక్ష్మణ్, గోణేకర్ శంకర్, మరియు గ్రామ పెద్దలు గ్రామస్తులు మండల సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం ఆపదలో ఉన్న మరొకరికీ ప్రాణధానం

* **బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్**



కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : రక్తదానం ఆపదలో ఉన్న మరొకరికీ ప్రాణధానమని బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అన్నారు. ఆదివారం సిఎంసి నిజాంపేట్ సర్కిల్ పరిధి ప్రగతి నగర్ లో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో మదీనాగూడ ఆదిత్య బ్లడ్ సెంటర్ సౌజన్యంతో నిర్వహించిన మెగా రక్తదాన , ఉచిత వైద్య శిబిరాన్ని బిఆర్ఎస్ ఎల్పి విప్,ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ పాల్గొని ప్రారంభించారు. ఈ రక్తదాన శిబిరంలో 150 మంది పాల్గొని రక్తదానం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యంతో ఉన్న ప్రతీ ఒక్కరూ రక్తదానం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ ధన్ రాజ్ యాదవ్, పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, ఐవిఎఫ్ ప్రగతి నగర్ సభ్యులు చిట్టుమల్ల.అజయ్ కుమార్, టి. సంతోష్ కుమార్, కె. భార్గవ,వై. సతీష్ కుమార్,పి. సనత్ కుమార్, కె. రాంబాబు,జి. సప్తగిరి, బి. భరత్ కుమార్, పి. పవన్ కుమార్, ఎస్. మనీష్ కుమార్, టి. నికేష్ కుమార్, ఎన్. హరికృష్ణ, ఎన్. పూర్ణ చందర్, బీఆర్ఎస్ మహిళా నాయకురాలు కృష్ణ మంజరి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బొబ్బిళ్ళ మురళి గురు స్వామికి ఉత్తమ గురు పురస్కార అవార్డు



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: శ్రీ మహా శాస్త్ర సేవా సంఘం హైదరాబాద్ ఆధ్వర్యంలో వ్యవస్థాపకులు సూదగాని రాజు గురుస్వామి అధ్యక్షతన త్యాగరాయ గానసభ చిక్కడపల్లి హైదరాబాదులో ఉత్తమ గురు పురస్కార అవార్డు మహోత్సవం శనివారం నిర్వహించారు. ఉత్తమ గురు పురస్కారం అవార్డు శబరిమలైలో వేంచేసి ఉన్నసాక్షాత్ అయ్యప్ప వంశస్థులు పందల రాజు, తిరునాల్ సురేష్ వర్మల చేతుల మీదుగా యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రానికి చెందిన శ్రీ సత్యదేవ సహిత అయ్యప్ప స్వామి దేవాలయం, చౌటుప్పల్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొబ్బిళ్ళ గురుస్వామికి గురు పురస్కార అవార్డు అందజేశారు. శాలువాతో ఘనంగా సత్కరించారు. అదేవిధంగా డాక్టర్ బాలరాజు గురుస్వామి, ప్రదీప్ తంత్రి గురుస్వామి, తంగవేలు సంతోష్ గురు స్వామి, భరణి వెంకటేష్ గురు స్వామి, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 118గురుస్వాములకు గురు పురస్కారం, అన్నపూర్ణ అవార్డులు అందజేసినట్లు తెలిపారు.

# అశ్రునయనాల మధ్య కామ్రేడ్ కామళ్ళ నవీన్ అంత్యక్రియలు



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి : వెలిదండ గ్రామంలో ఆదివారం జరిగిన సంతాప సభ పార్టీ గ్రామ కార్యదర్శి మేకల కనకారావు అధ్యక్షత వహించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి పి.సూర్యం పాల్గొని మాట్లాడుతూ చిన్న వయసు నుండి విప్లవ రాజకీయాలను ఉనికిపుచ్చుకొని ఈ దేశంలోని పీడిత ప్రజలను విముక్తి చేయడానికి తన పోరాట ప్రయాణాన్ని కొనసాగిస్తూ చివరి శ్వాస వదిలే వరకు ఎర్రజెండా నీడలో కొనసాగడని అన్నారు. అనేక పోలీసు నిర్బంధాలను, కుట్ర కేసులను, చిత్రహింసలను ఎదుర్కొంటూ ఈ ప్రాంతంలో కార్మిక ఉద్యమాన్ని నిర్మిస్తూ కార్మిక సమస్యలపై పనిచేస్తూ అనేక మందిని నాయకత్వ స్థాయిలోకి తీసుకువచ్చాడని కొనియాడారు.. ఆయన మృతి చెందటం పార్టీకి కార్మికోద్యమాలకు తీరని లోటని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని, నవీన్ కి విప్లవ జోహార్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మదన్న,బండారి ఐలయ్య, ఎ ఐ కె ఎం ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బిక్షపతి, ఎ ఐ కె ఎం ఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వక్కవంతుల కోటేశ్వరరావు,సూర్యాపేట జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్ కుమార్, ఐ ఎఫ్ టి యు రాష్ట్ర ఉపాధ్యక్షులు అర్ జనార్ధన్,పార్టీ నల్లగొండ జిల్లా కార్యదర్శి ఇందూరి సాగర్,తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్యా, పి డి ఎస్ యు రాష్ట్ర అధ్యక్షుడు పి.మహేష్, ఐ ఎఫ్ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య, ఎ ఐ కె ఎం ఎస్ రాష్ట్ర నాయకులు పోటు లక్ష్మయ్య,ప్రజావేదిక నాయకులు చిన్ని,కాంగ్రెస్ నాయకులు కందుల వెంకటేశ్వర్లు,పాల్గొని మాట్లాడారు.ఇంకా దీనిలో ఏ ఐ కె ఎం ఎస్ జిల్లా అధ్యక్షులు కునుకుంట్ల సైదులు,కార్యదర్శి బొడ్డు శంకర్,పోలేబోయిన కిరణ్, వి నరసింహారావు, పి వై ఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ధరావత రవి, అరుణోదయ జిల్లా నాయకులు గండు నగేష్, పిడిఎస్ యు జిల్లా అధ్యక్షులు పుల్లూరి సింహాద్రి, ఐ ఎఫ్ టు యు జిల్లా ఉపాధ్యక్షులు కామల్ల శ్రీనివాస్, పార్టీ శ్రేణులు, ఐ ఎఫ్ టి యు నాయకులు,కార్యకర్తలు,కార్మికులు కుటుంబ సభ్యులు,బంధుమిత్రులు పెద్దఎత్తున భౌతికకాయం పై పూల మాలలు వేసి నివాళులర్పించి,అంత్యక్రియల్లో అరుణోదయ కళాకారులు డబ్బు చప్పులతో పాటలతో నివాళులర్పిస్తూ పాల్గొన్నారు.

## నాణ్యమైన మల్బరీ ఆకులతో నాణ్యమైన పట్టుగూళ్ల ఉత్పత్తి



చిత్తూరు జిల్లా, ప్రజాస్ఫూర్తి : కేంద్ర పట్టు బోర్డు ఆధ్వర్యంలో ఎంఆర్ఎంఎ 2.0 కార్యక్రమంలో భాగంగా చిత్తూరు జిల్లా పెనుమూరు మండలం గంగుపల్లి గ్రామంలో ఆదివారం రైతుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నాణ్యమైన మల్బరీ ఆకుల ఉత్పత్తి, ఆరోగ్యవంతమైన పట్టుపురుగుల పెంపకం, నాణ్యమైన పట్టుగూళ్ల ఉత్పత్తికి పాటించాల్సిన శాస్త్రీయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని కేంద్ర పట్టు బోర్డు, పరిశోధన , విస్తరణ కేంద్రం, పలమనేరుకు చెందిన డా. తంగా రోజా కె., సైంటిస్ట్ బి నిర్వహించారు. జాయింట్ డైరెక్టర్ ఆఫ్ సెరికల్చర్ డి. వాణి, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ సెరికల్చర్ గీత, ఇతర పట్టు పరిశ్రమ శాఖ అధికారులు సంయుక్తంగా కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. కార్యక్రమంలో 60 మంది పట్టు రైతులు పాల్గొన్నారు. శిక్షణలో నాణ్యమైన మల్బరీ ఆకులు ఆరోగ్యవంతమైన పట్టుపురుగుల పెరుగుదలకు నాణ్యమైన పట్టుగూళ్ల ఉత్పత్తికి ఎంతో కీలకమని రైతులకు వివరించారు. అలాగే వ్యాధుల వ్యాప్తిని నివారించేందుకు పెంపక గృహం శుద్ధీకరణ బెడ్ డిస్ఇన్ఫెక్షన్ ప్రాధాన్యతను రైతులకు వివరించారు.ఈ సందర్భంగా మల్బరీ తోటలో పోషణ్ వినియోగంపై సాంకేతిక ప్రదర్శన నిర్వహించారు. పోషణ్‌ను ఉపయోగించే విధానం, సిఫారసు చేసిన మోతాదు సరైన సమయంలో వినియోగించడం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. మల్బరీ మొక్కల పెరుగుదల మరియు ఆకుల నాణ్యత మెరుగుపరచడంలో పోషణ్ వినియోగం గురించి అవగాహన కల్పించారు. అదేవిధంగా షూట్ క్రషింగ్ మెషీన్ వినియోగంపై జాయింట్ డైరెక్టర్ డి. వాణి రైతులకు అవగాహన కల్పించారు. రైతులు కేంద్ర పట్టు బోర్డు సిఫారసు చేసిన సాంకేతిక పరిజ్ఞానాలు, యాంత్రీకరణ ,సమగ్ర పట్టు పరిశ్రమ పద్ధతులను అనుసరించడం ద్వారా పట్టుగూళ్ల నాణ్యత, ఉత్పాదకత ,ఆదాయాన్ని మెరుగుపరుచుకోవచ్చని కార్యక్రమంలో సూచించారు.

## కాంగ్రెస్‌లో చేరిన ప్రతి ఉద్యమకారుడికి ప్రజాపాలనలో న్యాయం

* **మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు**



మల్కాజిగిరి, ప్రజాస్ఫూర్తి : ప్రజాపాలనలోనే ఉద్యమకారులకు న్యాయం జరుగుతుందని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. మల్కాజిగిరి చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ చేరికల కార్యక్రమంలో బీఆర్ఎస్‌కు చెందిన పలువురు ఉద్యమ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఉద్యమకారుడు, మాజీ కార్పొరేటర్ ఏకే మురుగేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మైనంపల్లి హనుమంతరావుతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. సాయినగర్ చౌరస్తా నుంచి నాయకులు, కార్యకర్తలు, మహిళా ప్రతినిధులు భారీ ర్యాలీగా మల్కాజిగిరి చౌరస్తాకు చేరుకున్నారు. అనంతరం టి.ఎన్. కృష్ణగౌడ్, జాగ్ మహేష్ గౌడ్, ఎల్లేష్, శ్రీనివాస్ రెడ్డి, యోగేందర్, ఆకుల శ్రీనివాస్, ఈశ్వర్ తదితరులు కాంగ్రెస్ కండువాలు కప్పుకుని పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సుమారు 2,000 మంది ఆటో యూనియన్, డీసీఎం యూనియన్ సభ్యులతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరినట్లు నిర్వాహకులు తెలిపారు. మైనంపల్లి హనుమంతరావు మాట్లాడుతూ తనతో కలిసి కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరూ తనకు గుర్తున్నారని అన్నారు. రానున్న ఎన్నికల్లో మరింత కష్టపడి పనిచేసి మల్కాజిగిరిలోని 16 డివిజన్లలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించేందుకు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఉద్యమకారులకు ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు అందించే అంశంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో మాట్లాడి హామీ తీసుకున్నట్లు వెల్లడించారు. కాంగ్రెస్‌లో చేరిన నాయకులు, కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో మల్కాజిగిరి అబ్జర్వర్ సమీర్ కౌశల్, మాజీ కార్పొరేటర్లు వై. ప్రేమ్ కుమార్, జితేంద్రనాథ్, మల్కాజిగిరి ఇన్‌చార్జి లక్ష్మీకాంత్ రెడ్డి, సీనియర్ నాయకులు వెంకటేష్ యాదవ్, బీకే శ్రీను, గుండా నిరంజన్, జీఎన్‌వీ సతీష్ కుమార్, పిట్టల శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షులు జీడి సంపత్ గౌడ్, వినోద్ యాదవ్, సత్యమూర్తి, యూసుఫ్ భాయ్, పిట్టల నాగరాజు, వైనాల ప్రవీణ్, రాందాస్, సంతోష్ ముదిరాజ్, రామచందర్, బాబు, సత్యనారాయణ, ఆశా, ఇందిర ప్రియదర్శిని, రోజా రమణి, ప్రభా, సుమలత, పుష్పలత, శారద, కనకలక్ష్మి, ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన ప్రతి ఉద్యమకారుడికి ప్రజాపాలనలో న్యాయం

* **మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు**



మల్కాజిగిరి, ప్రజాస్ఫూర్తి : ప్రజాపాలనలోనే ఉద్యమకారులకు న్యాయం జరుగుతుందని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. మల్కాజిగిరి చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ చేరికల కార్యక్రమంలో బీఆర్ఎస్‌కు చెందిన పలువురు ఉద్యమ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఉద్యమకారుడు, మాజీ కార్పొరేటర్ ఏకే మురుగేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మైనంపల్లి హనుమంతరావుతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. సాయినగర్ చౌరస్తా నుంచి నాయకులు,కార్యకర్తలు,మహిళా ప్రతినిధులు భారీ ర్యాలీగా మల్కాజిగిరి చౌరస్తాకు చేరుకున్నారు. అనంతరం టి.ఎన్. కృష్ణగౌడ్, జాగ్ మహేష్ గౌడ్, ఎల్లేష్, శ్రీనివాస్ రెడ్డి, యోగేందర్, ఆకుల శ్రీనివాస్, ఈశ్వర్ తదితరులు కాంగ్రెస్ కండువాలు కప్పుకుని పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సుమారు 2,000 మంది ఆటో యూనియన్, డీసీఎం యూనియన్ సభ్యులతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరినట్లు నిర్వాహకులు తెలిపారు. మైనంపల్లి హనుమంతరావు మాట్లాడుతూ తనతో కలిసి కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరూ తనకు గుర్తున్నారని అన్నారు. రానున్న ఎన్నికల్లో మరింత కష్టపడి పనిచేసి మల్కాజిగిరిలోని 16 డివిజన్లలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించేందుకు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఉద్యమకారులకు ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు అందించే అంశంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో మాట్లాడి హామీ తీసుకున్నట్లు వెల్లడించారు. కాంగ్రెస్‌లో చేరిన నాయకులు, కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో మల్కాజిగిరి అబ్జర్వర్ సమీర్ కౌశల్, మాజీ కార్పొరేటర్లు వై. ప్రేమ్ కుమార్, జితేంద్రనాథ్, మల్కాజిగిరి ఇన్‌చార్జి లక్ష్మీకాంత్ రెడ్డి, సీనియర్ నాయకులు వెంకటేష్ యాదవ్, బీకే శ్రీను, గుండా నిరంజన్, జీఎన్‌వీ సతీష్ కుమార్, పిట్టల శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షులు జీడి సంపత్ గౌడ్, వినోద్ యాదవ్, సత్యమూర్తి, యూసుఫ్ భాయ్, పిట్టల నాగరాజు, వైనాల ప్రవీణ్, రాందాస్, సంతోష్ ముదిరాజ్, రామచందర్, బాబు, సత్యనారాయణ, ఆశా, ఇందిర ప్రియదర్శిని, రోజా రమణి, ప్రభా, సుమలత, పుష్పలత, శారద, కనకలక్ష్మి, ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల హక్కుల కోసం పోరాడిన కామ్రేడ్ నవీన్‌కు విప్లవ జోహార్లు



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి : కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడిన కామ్రేడ్ నవీన్ కి సీపీఎం నాయకులు, కార్యకర్తలు విప్లవ జోహార్లు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.కార్మికులు, పేదలు, సామాన్య ప్రజల హక్కుల కోసం కామ్రేడ్ నవీన్ చేసిన పోరాటాలు స్ఫూర్తిదాయకమని నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు, గరిడేపల్లి మండల కార్యదర్శి ఎస్కే యాకూబ్, మండల కమిటీ సభ్యులు యానాల సోమయ్య ఉప సర్పంచ్ ,అంబటి బిక్షమయ్య, సారెడ్డి, సైదిరెడ్డి, దేవమాణిక్యం, తదితరులు పాల్గొన్నారు.

## హజెలో కంపెనీని తక్షణమే మూసివేయ్యాలి

- **తగరం సుభాష్ చంద్రబోస్**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: యాదాద్రి భువనగిరి జిల్లా దొతిగూడెంలోని హాజెలో పరిశ్రమలు శాశ్వతంగా మూసివేయాలని బహుజన్ సమాజ్ పార్టీ మునుగోడు నియోజకవర్గ అధ్యక్షుడు తగరం సుభాష్ చంద్రబోస్ డిమాండ్ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం దోతి గూడెం పరిధిలోని హెజోలా పరిశ్రమ ఎదుట ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తగరం సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ శుక్రవారం రాత్రి పరిశ్రమలో జరిగిన ఘోర ప్రమాదంలో అత్యంత విషాదకరమన్నారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల ఒక్కో కుటుంబాలకు రూ.5కోట్లు నష్టపరిహారం, కుటుంబ సభ్యునికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గాయపడిన కార్మికులకు పూర్తి వైద్య ఖర్చులు, తగిన నష్టపరిహారం చెల్లించాలని, చేశారు. జిల్లా వ్యాప్తంగా పరిశ్రమల భద్రతపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ప్రభుత్వానికి విన్నవించారు. కార్మికుల ప్రాణాల కంటే ఏ కంపెనీ లాభం గొప్పది కాదన్నారు. ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం లో బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు కత్తుల పరమేష్, మాధ రమేష్, నర్సింహా, సుక్క రాములు, ఉదయ్ కిరణ్, కత్తుల నర్సింహా, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## చౌటుప్పల్ లో దారుణహత్య

* **స్థానికంగా కలకలం రేపుతున్నవైనం**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి : చౌటుప్పల్ మండలంలో దారుణ హత్య ఆదివారం స్థానికంగా కలకలం రేపింది. చౌటుప్పల్ సిఐ మన్మధ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా అంకిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన రాపోలు దానయ్య(36) పంతంగి గ్రామపంచాయతీ పరిధిలోని శనిగలగుట్ట పరిధిలో కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం వ్యవసాయ పనుల నిమిత్తం చేను వద్దకు వెళ్లాడు. చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామపంచాయతీ పరిధి శనిగలగుట్టపై దానయ్య హత్య గురైనట్లు సమాచారం వచ్చిందన్నారు. తన సిబ్బందితో కలిసి హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. సంఘటనా స్థలంలో ఆధారాలను సేకరించేందుకు క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌కు సమాచారం అందించగా, వారు సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాల సేకరణలో నిమగ్నమయ్యారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ ద్వారా సంఘటనా స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ, సంబంధిత వ్యక్తులను విచారిస్తున్నారు. కేసు నమోదు చేసి హత్యకు గల కారణాలు, నిందితుల వివరాలు తదితర అంశాలపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దానయ్య భార్యకు వివాహేతర సంబంధం ఉన్నట్లు ఆరోపిస్తున్నారు. హత్యతో ఆమెకు సంబంధం ఉన్నట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

## అమ్మవారి అనుగ్రహం ప్రజలందరిపై సంపూర్ణంగా ఉండాలి

* బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్



కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : అమ్మవారి అనుగ్రహం ప్రజలందరిపై సంపూర్ణంగా ఉండాలని బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. శ్రావణమాస భోనాలను పురస్కరించుకొని ఆదివారం బాచుపల్లి, రాజీవ్ గాంధీ నగర్, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయాలలో నిర్వహించిన బోనాల వేడుకలకు బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై నల్ల పోచమ్మ, రేణుక ఎల్లమ్మ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, మాజీ కౌన్సిలర్ శంభీ పూర్ క్రిష్ణ, మాజీ కార్పొరేటర్లు కాసాని సుధాకర్, ఆగం రాజు, గాజుల సుజాత, మాజీ కో ఆప్షన్ సభ్యులు సలీం, చంద్రగిరి సతీష్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పార్కు స్థలాన్ని కాపాడాలంటూ ఎంపీ వినూత్న నిరసన



మియాపూర్: శేరిలింగంపల్లి నియోజకవర్గం హైదర్ నగర్ డివిజన్ మిత్రా హిల్స్ కాలనీలోని పార్కు స్థలాన్ని కాపాడాలంటూ చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి వినూత్న రీతిలో నిరసన తెలియజేశారు. పార్కు కోసం కేటాయించిన స్థలాన్ని హెచ్ఎండీఏ వేలం వేయాలని నిర్ణయించడంతో కొద్ది రోజులుగా స్థానికులు ఆందోళన చేస్తున్నారు. స్థానికులు ఆదివారం నిర్వహించిన ఆందోళనలో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, శేరిలింగంపల్లి భాజపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి రవికుమార్ యాదవ్ తదితరులు పాల్గొని.. నేలపై పడుకొని నిరసన తెలిపారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ, సంబంధిత స్థలంలో వెంటనే పూర్తి స్థాయిలో పార్కును అభివృద్ధి చేయాలన్నారు. స్థానికుల అభిమతానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని తెలిపారు. పార్టీ నాయకులు మహేశ్ యాదవ్, పద్మ, కాలనీ సంఘం అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, స్థానికులు సీతారామరాజు, రవీందర్ రావు అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ వ్యాప్తంగా నిరసనలకు బీఆర్ఎస్ పిలుపు

హైదరాబాద్: కాంగ్రెస్ 'వెయ్యి రోజుల దగా పాలన' పేరిట బీఆర్ఎస్ సమరభేరి మోగించింది. సెప్టెంబర్ 2 నుంచి రాష్ట్ర వ్యాప్త నిరసనలకు ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పిలుపునిచ్చారు. వారం రోజుల పాటు పార్టీ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ మోసగించిందని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. 420 హామీలు, 13 డిక్లరేషన్లు, 6 గ్యారంటీల పేరిట ప్రజలను కాంగ్రెస్ మోసం చేసిందని కేటీఆర్ అన్నారు. 'బాకీ కార్డుల' పేరిట కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, గ్రామగ్రామాన ప్రజలకు కాంగ్రెస్ మోసాన్ని వివరించాలని ఆయన పిలుపునిచ్చారు.

# బంజారా సమాజ అభివృద్ధికి, అభ్యున్నతికి ఎప్పుడూ రుణపడి ఉంటా

* బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : నా గెలుపులో కీలకంగా వ్యవహరించిన బంజారా సమాజ అభివృద్ధికి, అభ్యున్నతికి ఎప్పుడూ రుణపడి ఉంటానని బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. కె.ఎం. పాండు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సుమారు 12.00 లక్షల తమ సొంత నిధులతో సూరారం డివిజన్ శివాలయ నగర్ లో నిర్మించిన "బంజారా భవన్" ను బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనునిత్యం తన వెంట ఉండి తన గెలుపులో కీలకంగా వ్యవహరించిన బంజారాల అభివృద్ధికి, ఐక్యతకు ప్రతీక అన్నారు. ప్రజలకు చేసే సేవయే శాశ్వతంగా మిగిలిపోతుందనే మా నాన్నగారైన "కె ఎం.పాండు ఆశయ సాధనకు




అనుగుణంగా బంజారాల ఆత్మగౌరవానికి, అభ్యున్నతికి ప్రతీకగా నిర్మించిన ఈ భవనం నేడు ప్రారంభించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా తనను మూడుసార్లు గెలిపించి, మూడవసారి రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో గెలిపించి, రానున్న రోజుల్లో కూడా బంజారా సమాజ అభివృద్ధికి నా సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు. అంతకుముందు బంజారా మహిళలు తమ సాంప్రదాయ దుస్తులలో నృత్యాలు చేస్తూ ఎమ్మెల్యే కి స్వాగతం పలకడం అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, సురేష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్, పోలే శ్రీకాంత్, సీనియర్ నాయకులు వారాల వినోద్, కొండకల్ల శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ హుస్సేన్, కోలా శ్రీకాంత్, ఫెరోజ్, మహేశ్వర్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు హేమలతా రెడ్డి, బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ న్యూ శివాలయ నగర్ కమిటీ అధ్యక్షులు గోపాల్ రాథోడ్, ప్రధాన కార్యదర్శి శంకర్ పవర్, ముఖ్య సలహాదారులు దుర్గాదాస్ మహారాజ్, శత్రు నాయక్, కోశాధికారి రాజ్ ప్రసాద్ నాయక్, సభ్యులు బీరం నాయక్, లక్ష్మణ్ పవర్, బాల్ సింగ్ పవార్, దర్శన్ పవార్, రాజు పవార్, రాజు నాయక్, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## 20 ఏళ్ల చీకట్లకు తెర.. బాలాజీ గుట్టపై వెలుగులు

* మూడు రోజుల్లోనే ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు..
* విద్యుత్ సరఫరా కల్పించిన ఎమ్మెల్యే రామారావు పటేల్



ప్రజాస్ఫూర్తి, భైంసా : నిర్మల్ జిల్లా తానూర్ మండలంలోని బోరేగాం గ్రామం బాలాజీ గుట్టపై దాదాపు 20 సంవత్సరాలుగా విద్యుత్ సరఫరా లేక భక్తులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ గ్రామానికి వచ్చిన సందర్భంగా బాలాజీ ఆలయానికి విద్యుత్ కనెక్షన్ లేకపోవడంతో ఎదురవుతున్న ఇబ్బందులను గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. విషయాన్ని వెంటనే పరిగణనలోకి తీసుకున్న ఎమ్మెల్యే రామారావు పటేల్, అధికారులతో మాట్లాడి చర్యలు చేపట్టారు. దీంతో కేవలం మూడు రోజుల వ్యవధిలోనే బాలాజీ గుట్టపై ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో దాదాపు రెండు దశాబ్దాలుగా నెలకొన్న సమస్యకు పరిష్కారం లభించడంతో గ్రామస్తులు, భక్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం కారణంగానే బాలాజీ గుట్టపై ఇన్నేళ్లుగా విద్యుత్ సరఫరా లేకపోయిందన్నారు. ఇకపై గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే తక్షణమే స్పందించి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. బాలాజీ గుట్టపై విద్యుత్ సౌకర్యం కల్పించిన ఎమ్మెల్యే రామారావు పటేల్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మండల సీనియర్ నాయకులు, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మంత్రి పొన్నంతో చర్చలు సఫలం.. ఆటో కార్మికుల సమ్మె విరమణ

హైదరాబాద్: తెలంగాణ వ్యాప్తంగా ఆదివారం అర్ధరాత్రి నుంచి తలపెట్టిన ఆటోల సమ్మెను విరమించుకున్నట్లు ఆటో కార్మిక సంఘాల జేఏసీ నేతలు ప్రకటించారు. రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో జేఏసీ నేతలు జరిపిన చర్చలు సఫలం కావడంతో సమ్మెను విరమించారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ఆటో కార్మిక సంఘాల డిమాండ్ల పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. ఆర్టీసీ తరఫున ఈవీ ఆటోలు కొనుగోలు చేసే ప్రసక్తే లేదని.. అది దుష్ప్రచారం మాత్రమేనని స్పష్టం చేశారు. సెప్టెంబర్



1న కార్మిక, రవాణా, ఆటో కార్మిక సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ఆటో ఛార్జీలు పెంచేందుకు వీలుగా జీవో విడుదలకు ప్రభుత్వం అంగీకారం తెలిపిందన్నారు. ఓలా, ఉబర్‌లా ప్రభుత్వం తరఫున యాప్ రూపొందించాలని నిర్ణయించినట్లు చెప్పారు.

## శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపనలో ఎమ్మెల్యే రామారావు పటేల్



ప్రజాస్ఫూర్తి, భైంసా : నిర్మల్ జిల్లా తానూర్ మండలంలోని హంగిర్గ గ్రామ అభివృద్ధికి సుమారు రూ.కోటిన్నర నిధులు మంజూరైనట్లు ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ తెలిపారు దేవాదాయ, ధర్మాదాయ శాఖ సీజీఎఫ్ నిధుల నుంచి రూ.50 లక్షలతో చేపట్టనున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కళ్యాణ మండపం, రోడ్లు, డ్రైనేజీతో పాటు హిప్నెల్లి నుంచి సరస్వతి నగర్ వరకు డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. అంగన్‌వాడీ, వివో భవనాలు, గ్రామపంచాయతీ భవనం తదితర అభివృద్ధి పనులకు సుమారు రూ.కోటిన్నర వరకు నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. తానూర్ మండలానికి సంబంధించిన 27 ప్యాకేజీ అంశాన్ని పలుమార్లు అసెంబ్లీలో ప్రస్తావించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ ప్యాకేజీ పూర్తి చేయడానికి రూ.700 కోట్లకు పైగా బడ్జెట్ అవసరమవుతుందని తెలిపారు. రైతాంగ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని 27 ప్యాకేజీ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. 27 ప్యాకేజీ పూర్తయితే తానూర్ మండలం మొత్తం వ్యవసాయ రంగంలో సస్యశ్యామలంగా మారుతుందని పేర్కొన్నారు. గ్రామంలో ఉన్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో దశలవారీగా పరిష్కరిస్తానని ఎమ్మెల్యే గ్రామస్తులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మండల సీనియర్ నాయకులు, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# తెలంగాణలో విద్యార్థులకు ఏటా రూ.12,000.. దరఖాస్తుకు రేపే చివరి తేదీ!

- జాతీయ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు గడువు రేపటితో ముగింపు
- ఎంపికైన విద్యార్థులకు నెలకు రూ.1,000 చొప్పున నాలుగేళ్ల పాటు ఆర్థిక సహాయం
- ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 8వ తరగతి చదివే విద్యార్థులు అర్హులు
- కుటుంబ వార్షిక ఆదాయం రూ.3.50 లక్షలకు మించరాదు
- రాత పరీక్షలో ప్రతిభ ఆధారంగా విద్యార్థుల ఎంపిక

తెలంగాణలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం అందించే 'నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్' (NMMS) పథకం 202627 విద్యా సంవత్సరానికి దరఖాస్తుల గడువు సమీపిస్తోంది. అర్హులైన విద్యార్థులు ఆగస్టు 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభావంతులైన విద్యార్థులు 8వ తరగతి తర్వాత చదువును మధ్యలో ఆపకుండా ప్రోత్సహించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ఈ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులకు నెలకు రూ.1,000 చొప్పున, ఏడాదికి మొత్తం రూ.12,000 ఆర్థిక సహాయం అందుతుంది. ఈ సహాయం 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు, అంటే మొత్తం నాలుగేళ్ల పాటు కొనసాగుతుంది. కుటుంబ వార్షిక




ఆదాయం రూ.3.50 లక్షలకు మించని విద్యార్థులు ఈ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. విద్యార్థులు 7వ తరగతిలో కనీసం 55% మార్కులు సాధించి ఉండాలి (ఎస్సీ/ఎస్టీ విద్యార్థులకు 5% మినహాయింపు ఉంటుంది). రాత పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేస్తారు. ఈ పరీక్షలో మెంటల్ ఎబిలిటీ టెస్ట్ (MAT), స్కొలాస్టిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (SAT) ఉంటాయి. అయితే, నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు, సైనిక్ స్కూళ్లు, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఈ పథకానికి అర్హులు కారు. స్కాలర్‌షిప్ కొనసాగాలంటే, విద్యార్థులు ప్రభుత్వ లేదా ఎయిడెడ్ పాఠశాలలు/కళాశాలల్లోనే చదువును కొనసాగించాల్సి ఉంటుంది. దరఖాస్తుకు రేపే చివరి తేదీ కావడంతో, అర్హులైన విద్యార్థులు వెంటనే స్పందించాలని అధికారులు కోరుతున్నారు. పథకానికి సంబంధించిన పూర్తి వివరాలు, దరఖాస్తు విధానం కోసం అధికారిక వెబ్‌సైట్ bse.telangana.gov.in ను సందర్శించవచ్చు.

## శంషాబాద్‌లో మద్యం మత్తులో హల్‌చల్.. ప్రయాణికుడిని వదిలేసి వెళ్లిన విమానం



శంషాబాద్: మద్యం మత్తులో ఓ ప్రయాణికుడు హల్‌చల్ చేసిన ఘటన శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో ఆదివారం చోటు చేసుకుంది. విమానాశ్రయం అధికారుల వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి విమానంలో వారణాసి వెళ్లేందుకు టికెట్ తీసుకున్నాడు. తీవ్రమైన మద్యం మత్తులో విమానాశ్రయానికి చేరుకున్నాడు. అతి కష్టం మీద బోర్డింగ్ ప్రక్రియ పూర్తి చేసుకుని విమానం ఎక్కుతున్న క్రమంలో తూలుతుండడమే కాకుండా సిబ్బందితో దురుసుగా ప్రవర్తించాడు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎయిర్‌లైన్స్ ప్రతినిధులు ఆ ప్రయాణికుడిని వదిలేసి వెళ్లిపోయారు.

## 'టాక్సిక్' ఈవెంట్‌లో అపశ్రుతి.. మల్లారెడ్డి యూనివర్సిటీపై కేసు

- యశ్ 'టాక్సిక్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ప్రమాదం
- సౌండ్ బాక్స్ పోల్ కూలి ఇద్దరు యువకులకు గాయాలు
- భద్రతా లోపాలపై మల్లారెడ్డి యూనివర్సిటీ యాజమాన్యంపై కేసు
- వెంటనే స్పందించి అభిమానులను వారించిన హీరో యశ్
- ఈవెంట్ మేనేజర్, చిత్ర యూనిట్‌పైనా కేసు నమోదు

కన్నడ స్టార్ యశ్ హీరోగా నటిస్తున్న 'టాక్సిక్' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో అపశ్రుతి చోటుచేసుకుంది. హైదరాబాద్‌లోని మల్లారెడ్డి యూనివర్సిటీలో జరిగిన ఈ కార్యక్రమంలో భద్రతా లోపాల కారణంగా ప్రమాదం జరగడంతో, యూనివర్సిటీ యాజమాన్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే, శనివారం రాత్రి మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీ ప్రాంగణంలో 'టాక్సిక్' చిత్ర యూనిట్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో అభిమానులు, విద్యార్థులు హాజరయ్యారు. ఈ క్రమంలో కొందరు యువకులు స్టేజీని సరిగా చూసేందుకు ఫ్లడ్‌లైట్లు, భారీ సౌండ్ బాక్సులను ఏర్పాటు చేసిన ఇనుప పోల్స్‌పైకి ఎక్కారు. బరువు ఎక్కువ కావడంతో ఓ సౌండ్ బాక్స్ పోల్ ఒక్కసారిగా కుప్పకూలింది. దీంతో స్వల్ప తొక్కిసలాట జరిగి, ఇద్దరు యువకులు గాయపడ్డారు.



ప్రమాదం జరిగినప్పుడు యశ్ వేదికపై ప్రసంగిస్తున్నారు. ఘటనను గమనించిన వెంటనే ఆయన తన ప్రసంగాన్ని ఆపి, "అక్కడ అందరూ సురక్షితంగా ఉన్నారా? ఏం జరిగిందో చూడండి" అంటూ ఆందోళన వ్యక్తం చేశారు. లైటింగ్ స్టాండ్లు, మైక్ పోల్స్‌పై ఉన్నవారు వెంటనే కిందకు దిగాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమాచారం అందుకున్న పేట్‌బషీరాబాద్ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన ఇద్దరు యువకులను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక భద్రతా ప్రమాణాలు, జన నియంత్రణ నిబంధనలు పాటించడంలో విఫలమయ్యారని ఆరోపిస్తూ మల్లారెడ్డి యూనివర్సిటీ యాజమాన్యం, ఈవెంట్ మేనేజర్‌పై కేసు నమోదు చేశారు. దీంతో పాటు చిత్ర యూనిట్‌పై కూడా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

# చలికాలంలో ఉపిరితిత్తులను కాపాడుకోవడం ఎలా?



చలికాలం.. ఊరితిత్తులకు సంబంధించిన సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. కాబట్టి ఈ ఊపిరితిత్తులను ఎలా కాపాడుకోవాలి? శ్వాస కోస వ్యాధులు రాకుండా ఎలా కాపాడుకోవాలో ఈ కథనంలో తెలుసుకుందాం. చలికాలంలో ఉష్ణోగ్రత తగ్గుముఖం పట్టడం వల్ల చాలా మందికి శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఏర్పడుతుంది. చల్లని, పొడి గాలి, అలాగే వాతావరణ మార్పులు ఈ సమస్యను మరింత తీవ్రతరం చేస్తాయి. చల్లని గాలి మన ఊపిరితిత్తులలోకి ప్రవేశించినప్పుడు.. అది శ్వాస సామర్థ్యంపై ప్రభావం చూపుతుంది. దీని వల్ల దగ్గు, ఆస్తమా, బ్రాంకైటిస్ వంటి సమస్యలు వస్తాయి. ఈ పరిస్థితులను ఎదుర్కోవటానికి జాగ్రత్తగా ఉండటం, సరైన చర్యలు తీసుకోవడం చాలా ముఖ్యం. వైద్య నిపుణుల ప్రకారం.. శీతాకాలంలో చల్లని గాలి ఊపిరితిత్తులకు కష్టంగా ఉంటుంది. ఇది మన శ్వాస గొట్టాన్ని ఇబ్బందికి గురి చేస్తుంది. చల్లని, పొడి గాలి కూడా అలెర్జీలు, ఇన్ఫెక్షన్లను పెంచుతాయి.

### చలికాలంలో కాలుష్యం పెరగడమే అతిపెద్ద సమస్య..

చలికాలంలో బలహీనంగా మారిన ఊపిరితిత్తులపై మరింత ఒత్తిడి తెచ్చే పొగ, ధూళి కణాలు ఈ సమయంలో మరింత చురుగ్గా మారతాయి. ముఖ్యంగా ఉబ్బసం రోగులకు, చల్లని గాలి వారి లక్షణాలను మరింత తీవ్రతరం చేస్తుంది. చల్లటి, కలుషితమైన గాలిని పీల్చడం వల్ల శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది మాత్రమే కాకుండా ఊపిరితిత్తులలో మంట, ఇన్ఫెక్షన్ కూడా వస్తుంది. ఇంతే కాకుండా.. శీతాకాలంలో రోగనిరోధక శక్తి బలహీనపడుతుంది . శారీరక శ్రమ లేకపోవడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి తగ్గి, సీజనల్ ఫీవర్, జలుబు వంటి సమస్యలు వస్తాయి.

### తీసుకోవాల్సిన చర్యలు..

ఊపిరితిత్తుల ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు క్రమం తప్పకుండా వ్యాయామం చేయండి. సమతుల్య ఆహారం తీసుకోండి. మిమ్మల్ని మీరు హైడ్రేట్ గా ఉంచుకోండి. హైడ్రేషన్ ఊపిరితిత్తులను తేమగా ఉంచడంలో సహాయపడుతుంది. ఇది శ్వాసను సులభతరం చేస్తుంది. దుమ్ము మరియు పొగకు దూరంగా ఉండండి. ఎవరైనా.. శీతాకాలంలో శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిని అనుభవిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. ప్రారంభ చికిత్సతో తీవ్రమైన సమస్యలను నివారించవచ్చు. అంతే కాకుండా మీ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం, దుమ్ము, పొగ నుంచి దూరంగా ఉండటం ముఖ్యం.



# పాలు మంచివేనా? ఉబకాయం ఉన్నోళ్లు తాగొచ్చా?



ఇటీవల ఉబకాయం అనే సమస్య చాలా మందిని వేదిస్తోంది. దీంతో ఏ ఫుడ్ తీసుకోవాలో.. ఏ ఫుడ్ తీసుకోవొద్దో తెలియక వారు తికమక పడుతున్నారు. అయితే ఇప్పటివరకు హెల్తీ అనుకున్న పాలు కూడా.. ఇప్పుడు అన్ హెల్దీ అన్న టాక్ వస్తోంది. ముఖ్యమంత్రి ఉబకాయం ఉన్నోళ్లు పాలు తాగొద్దని ఆహార నిపుణులు సూచిస్తున్నారు.

ప్రస్తుత కాలంలో చాలా మందిని కొవ్వు (కొలెస్ట్రాల్) సమస్య వేధిస్తోంది. దీని కారణంగా శరీర బరువు భారీగా పెరిగిపోతోంది. ఇలాంటి సమస్యను ఎదుర్కొంటున్న వారు ఏం తినాలన్నా, తాగాలన్నా ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తుంటారు. ఏం తింటే ఏమవుతుందో అనే భయంతో కొన్ని ఆహార పదార్థాలను తినడం, తాగడం మానేస్తున్నారు. ఈ లిస్టులో మొదటి స్థానంలో వచ్చేది పాలు.పాలు తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఒకేసారి లభిస్తాయి. అందుకే రోజూ కనీసం ఒక గ్లాసు పాలు తాగాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తారు. పాలు తాగడం వల్ల బలమైన ఎముకలకు అవసరమైన కాల్షియంను అందిస్తుంది. అంతే కాకుండా.. శరీరానికి కావాల్సిన అవసరమైన అనేక ఖనిజాలు, విటమిన్లు పాలలో నుంచి లభిస్తాయి. అయితే.. పాలు తాగితే బరువు పెరగడం కూడా ముడిపడి ఉంది. బరువు పెరుగుతుందనే భయంతో చాలా మంది పాలు తాగరు. అయితే పాలు తాగడం వల్ల ఊబకాయం పెరుగుతుందా..? అనే దానికి వివరాలు తెలుసుకుందాం... పాలలో పోషకాలతో పాటు, కేలరీలు కూడా ఎక్కువగా ఉంటాయి. ఈ క్రమంలో.. అధిక మొత్తంలో పాలు తాగడం వలన ఊబకాయానికి దారి తీస్తుంది. అయితే, కొన్ని ప్రత్యేక విషయాలపై శ్రద్ధ పెడితే.. పాలు తాగితే బరువు పెరిగే ప్రమాదాన్ని సులభంగా తగ్గించుకోవచ్చు.



పాలు తాగడం వలన బరువు తగ్గే సరైన మార్గం ఏమిటి..?

మీరు మీ బరువును నియంత్రించుకోవడానికి పాలు తాగేటప్పుడు కేలరీలను తగ్గించాలి. అందు కోసం.. ఎక్కువ పరిమాణంలో పాలు తాగడం మానుకోండి. అంతే కాకుండా.. పాలలో కేలరీల పరిమాణాన్ని తగ్గించడానికి, మొత్తం పాలకు బదులుగా స్కిమ్డ్ మిల్క్ తీసుకోండి. అంటే.. పాల నుండి మీగడను పూర్తిగా తీసివేసి తాగండి. 1 గ్లాసు మొత్తం కొవ్వు పాలలో 146 కేలరీలు, కొవ్వు లేని పాలలో 86 కేలరీలు ఉంటాయి. ఈ క్రమంలో.. మీ అవసరాన్ని బట్టి సరైన పాలను తాగాలి. మీరు బరువు తగ్గించే డైట్‌లో ఉన్నట్లయితే.. మీ రోజువారీ కేలరీల కౌంట్‌ను దృష్టిలో ఉంచుకుని పాలను తీసుకోవాలి.

# కాజు హల్వా .. ఇలా ప్రిపేర్ చేసుకోండి.. !



దీపావళి పండగకు చాలా మంది స్వీట్స్ తింటూ ఉంటారు. అలాగే ఇంటికి వచ్చే అతిథులకు బహుమతిగా ఈ స్వీట్స్ ఇస్తూ ఉంటారు. దీనికోసం షాపుల నుంచి స్వీట్స్ తీసుకొని ఇస్తారు. కానీ ఈ దీపావళికి స్వీట్స్ బయటి నుంచి కాకుండా ఇంట్లోనే చేసి తినడడంతో పాటు, మీ ఇంటికి వచ్చిన అతిథులకు కూడా ఇస్తే చాలా బాగుంటుంది. అందుకే కాజు హల్వా అనేది బెస్ట్ ఆప్షన్ అని చెప్పుకోవచ్చు. యితే ఈ కాజు హల్వాను ఎలా చేసుకోవాలి, దానికి కావాల్సిన పదార్థాలు ఏంటి, ఎలాంటి పద్ధతుల్లో హల్వా చేసుకుంటే రుచి అమోఘంగా వస్తుందనేది ఈ స్టోరీలో చూద్దాం.



| కాజు హల్వా తయారీకి కావాల్సిన పదార్థాలు |
|---|
| గోధుమ పిండి |
| కుంకుమ పువ్వు |
| జీడిపప్పు |
| పంచదార లేదా వీలైతే బెల్లం పొడి |
| నెయ్యి |
| యాలకుల పొడి |
| డ్రై ఫ్రూట్స్ |

**కాజు హల్వా తయారీ విధానం**

ఈ కాజు హల్వా తయారు చేయడానికి ముందుగా జీడిపప్పును మెత్తగా పొడి చేసుకొని పక్కకు పెట్టుకోవాలి. అనంతరం ఒక గిన్నె తీసుకొని అందులో నీళ్లు పోసి మరిగించండి. నీళ్లు మరిగాక అందులో పంచదార లేదా బెల్లం పొడి వేసి, మంటను హైలో పెట్టి అది కరిగేంత వరకు మరిగించుకోవాలి. ఆ సమయంలోనే అందులో యాలకుల పొడి, కుంకుమ పూల రేకులు వేసి కొంచెం సేపు మరిగించుకొని పక్కకు పెట్టుకోవాలి.అనంతరం మరొక గిన్నె తీసుకొని అందులో నెయ్యి వేసి.. అందులోనే గోధుమ పిండి, పిండిలా చేసుకున్న జీడిపప్పును వేయించాలి. ముఖ్యంగా మాడిపోకుండా చూసుకోవాలి. అనంతరం ఆ పిండిలో మనం ముందుగా చేసి పెట్టుకున్న పంచదార లేదా బెల్లం పొడితో చేసుకున్న పాకంను పోసి మెల్లమెల్లగా కలుపుకోవాలి. ఉండలు లేకుండా, మిశ్రమం దగ్గర పడే కొద్దీ కలుపుకుంటూ ఉండాలి. అనంతరం ఒక బౌల్‌లో ఆ హల్వాను వేసుకొని దానిపై కొన్ని డ్రై ఫ్రూట్స్ స్లైసెస్‌ను గార్నిష్ చేసుకుంటే సరిపోతుంది. దీపావళికి ఎంతో రుచికరమైన కాజు హల్వా సిధమైనట్లే.



# 7 ఏళ్లుగా సహజీవనం.. ఇద్దరు పిల్లలు..



'ధురందర్' సినిమాలో విలన్ గా నటించి పాన్ ఇండియా రేంజ్ లో ఫేమస్ అయిన నటుడు అర్జున్ రాంపాల్ రెండో వివాహం చేసుకున్నాడు. తన ప్రియురాలు గాబ్రియెల్లా డెమెట్రియాడెస్‌తో కలిసి అధికారికంగా మూడు ముళ్ల బంధలోకి అడుగు పెట్టాడు. ఉత్తర గోవాలోని మపుసా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వీరు రిజిస్టర్ మ్యారేజ్ చేసుకున్నారు. శుక్రవారం (ఆగస్టు 21) సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఈ ప్రేమ పక్షులు ఉత్తర గోవాలోని మపుసాలో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరుకున్నారు. ఆ సమయంలో ఇద్దరూ సాధారణ దుస్తులు ధరించి ఉన్నారు. రిజిస్టర్ మ్యారేజ సమయంలో వారితో పాటు కొందరు స్నేహితులు, సన్నిహితులు కూడా ఉన్నారు. అర్జున్‌గాబ్రియెల్లాల వివాహం గోవా యూసీసీ (UCC) కింద నమోదు చేయబడిందని సబ్ రిజిస్ట్రార్ సూరజ్ వెర్నేకర్ తెలిపారు. కాగా అర్జున్, గాబ్రియెల్లా 2018 నుంచి కలిసి ఉంటుననారు. చాలా కాలం పాటు సహజీవనం చేసిన తర్వాత, వీరిద్దరూ డిసెంబర్ 2025లో నిశ్చితార్థం చేసుకున్నారు. ఇప్పుడు అధికారికంగా పెళ్లిపీటలెక్కారు. అర్జున్ రాంపాల్, గాబ్రియెల్లా డెమెట్రియాడెస్‌లకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. 2019లో అరిక్ జన్మించగా, 2023లో ఆరవ్ పుట్టాడు. కాగా వీరికి బాలీవుడ్ లో మంచి పాపులారిటీ క్రేజ్ ఉంది. అయితే తమ వ్యక్తిగత జీవితాల విషయంలో మాత్రం చాలా గోప్యతను పాటిస్తారు. ఇక అర్జున్ భార్య విషయానికి వస్తే.. గాబ్రియెల్లా డెమెట్రియాడెస్ దక్షిణాఫ్రికాలో పుట్టి పెరిగింది. కేవలం 16 ఏళ్ల వయసులోనే మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టింది. ఆ తర్వాత ఫ్యాషన్ డిజైనర్ గానూ సత్తా చాటింది. ఆ తర్వాత నటిగా సినిమాల్లోకి అడుగు పెట్టింది. పలు హిందీ సినిమాలు, వెబ్ సిరీసుల్లో నటించిన ఆమె తెలుగు ప్రేక్షకులకు కూడా ఆమె సుపరిచితమే. అక్కినేని నాగార్జున, కార్తీ హీరోలుగా నటించిన 'ఊపిరి' సినిమాలో గాబ్రియెల్లా కీలక పాత్రలో నటించింది.



## ఇది సత్యం మాట.. ఇంకా డౌటా!

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న 158వ చిత్రానికి 'కాకా' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. బాబీ కొల్లి దర్శకత్వంలో కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె నారాయణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 13న విడుదలకానుంది. శనివారం చిరంజీవి జన్మదినం సందర్భంగా టైటిల్ ప్రకటనతో పాటు గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఇందులో ఆక్వా ఇండస్ట్రీస్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేసే సత్యం పాత్రలో కనిపించారు చిరంజీవి. రెండు విభిన్నమైన లుక్స్‌తో ఆయన ఆకట్టుకున్నారు. 'ఇది సత్యం మాట..ఇంకా డౌటా' అంటూ చిరు చెప్పిన డైలాగ్ హైలైట్‌గా నిలిచింది. ఈ చిత్రానికి సంగీతం: తమన్, ప్రొడక్షన్ డిజైనర్: అవినాష్ కొల్లా, సంభాషణలు: భానునందు, రచనదర్శకత్వం: బాబీ కొల్లి.

**'విశ్వంభర' స్పెషల్ పోస్టర్**

మెగాస్టార్ చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకొని 'విశ్వంభర' చిత్రం నుంచి కొత్త పోస్టర్‌తో పాటు ఒరిజినల్ సౌండ్ ట్రాక్‌ను విడుదల చేశారు. పోస్టర్‌లో చిరంజీవి ఫెరోషియస్ లుక్‌లో కనిపిస్తున్నారు. దైవత్వం, వీరత్వం కూడిన ప్రపంచాన్ని పోస్టర్ ప్రజెంట్ చేస్తున్నది. త్వరలో ఈ సినిమా విడుదల తేదీని ప్రకటిస్తామని మేకర్స్ తెలిపారు. వశిష్ట దర్శకత్వం వహిస్తున్న ఈ సోషియో ఫాంటసీ చిత్రాన్ని విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. కీరవాణి స్వరకర్త.

## 30వ సినిమా ఆ దర్శకుడితోనే?



అగ్ర హీరో మహేశ్‌బాబు ప్రస్తుతం తన 29వ సినిమా 'వారణాసి'లో నటిస్తున్నారు. ఈ అడ్వెంచరస్ యాక్షన్ థ్రిల్లర్ వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకురానుంది. దీని తర్వాత సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో మహేశ్‌బాబు ఓ సినిమా చేయబోతున్నారని గతకొంతకాలంగా వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఈ విషయంలో ఇప్పటివరకూ అధికారికంగా ఎలాంటి సమాచారం వెలువడలేదు. అయితే ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సందీప్ రెడ్డి సోదరుడు, నిర్మాత ప్రణయ్‌రెడ్డి వంగా ఈ ప్రాజెక్ట్‌పై ఆసక్తికరమైన విషయాల్ని వెల్లడించారు. మహేష్‌బాబుసందీప్‌రెడ్డి వంగా కాంబో ప్రాజెక్ట్ తప్పకుండా ఉంటుందని చెప్పారు. అయితే హిందీలో సందీప్ రెడ్డి వంగా 'యానిమల్' సీక్వెల్ 'యానిమల్ పార్క్' పూర్తిచేసిన తర్వాతే మహేశ్‌బాబుతో చేసే సినిమా మొదలయ్యే అవకాశాలున్నాయని హింట్ ఇచ్చారు. కొంత సమయం పట్టినప్పటికీ వారిద్దరి కాంబినేషన్‌లో సినిమా మాత్రం పక్కా అన్నట్లు మాట్లాడారు ప్రణయ్ రెడ్డి వంగా. ఈ నేపథ్యంలో మహేశ్‌బాబు ప్రతిష్టాత్మక 30వ సినిమా సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలోనే తెరకెక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అభిమానులు భావిస్తున్నారు.

# 'సహ' మూవీ సెప్టెంబర్ 4న రిలీజ్



నిశాంత్ దోటి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఎమోషనల్ డ్రామా 'సహా (లైఫ్ ఆఫ్ సంజు)' ప్రస్తుతం ప్రమోషన్స్ తో సందడి చేస్తోంది. శివ కుమార్ కాసారం, శ్వేతా లక్ష్మణ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రం ప్రేమ, అనుబంధాలు, జ్ఞాపకాలు, జీవితంలో ఎదురయ్యే భావోద్వేగ సంఘర్షణల చుట్టూ సాగనుంది. సుమైరా స్టూడియోస్ బ్యానర్‌పై తేజ వెల్పుచర్ల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన పాటలు, ప్రమోషనల్ కంటెంట్‌తో ఆసక్తి పెంచుకున్న 'సహా' సెప్టెంబర్ 4న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

ఈ సందర్భంగా విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్‌లో శివ కుమార్ కాసారం, శ్వేతా లక్ష్మణ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ జర్నీలో ఆత్మీయంగా కనిపించారు. ఈ విజువల్ ఇద్దరి మధ్య ప్రేమ, అనుబంధాన్ని సహజంగా చూపిస్తూ సినిమా నేపథ్యంపై ఆసక్తిని పెంచుతోంది.

సంజు జీవితంలోని వివిధ దశలను ఈ సినిమా ప్రజెంట్ చేస్తోంది. ప్రేమ, విడిపోవడం, మధురమైన జ్ఞాపకాలు, కష్టాలను అధిగమించేందుకు అవసరమైన మనోధైర్యం వంటి అంశాలను కథలో చూపించనున్నారు. పాత్రలు, వాటి మధ్య ఉండే అనుబంధాల ద్వారా ఒక మనసుకు దగ్గరయ్యే ఎమోషనల్ జర్నీగా అందించనున్నాయి. ఈ చిత్రంలో ప్రజనా పాండ్యా, మహిపాల్, అప్పాజీ, భారతి, మేఘన సునీల్, బాంబే పద్మ, కొండారెడ్డి, హర్షవర్ధన్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సినిమాటోగ్రాఫర్‌గా కరుణాకర్ కె, ఎడిటర్‌గా దినేష్ పెద్ది, సంగీత దర్శకుడిగా శేఖర్ చంద్ర పనిచేస్తున్నారు. తారాగణం: శివ కుమార్ కాసారం, శ్వేత లక్ష్మణ్, ప్రజన పాండ్య, మహిపాల్, అప్పాజీ, భారతి, మేఘన సునీల్, బొంబాయి పద్మ, కొండా రెడ్డి, హర్షవర్ధన్,



## ఆరోజు దారుణంగా ప్రవర్తించారు..

ప్రస్తుతం ఇరుముడి సినిమాతో సూపర్ హిట్ అందుకుంది హీరోయిన్ ప్రియా భవానీ శంకర్. మాస్ మహారాజా రవితేజ ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రానికి శివ నిర్వాణ దర్శకత్వం వహించారు. ఆగస్ట్ 21న విడుదలైన ఈ చిత్రానికి మంచి రెస్పాన్స్ వస్తుంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ప్రియా భవానీ శంకర్ కోలీవుడ్ హీరో గురించి ఆసక్తికర విషయాలు పంచుకుంది. ఆమె యాంకర్‌గా ఉన్న రోజుల్లో ప్రముఖ నటుడు ధనుష్‌ను ఇంటర్వ్యూ చేసిన ఒక సంఘటనను ఆమె గుర్తుచేసుకున్నారు. ఆ సమయంలో ధనుష్ చాలా అలసిపోయి, ఇంటర్వ్యూపై పెద్దగా ఆసక్తి చూపలేదని ఆమె తెలిపారు. దీని నుండి ఎప్పుడు బయటపడతాను? అన్నట్లుగా అతని మూడ్ ఉందని ప్రియ భవాని శంకర్ పేర్కొన్నారు. అప్పుడు అతని ప్రవర్తనను ఎంత అహంకారం! ఎంత యాటిట్యూడ్! అని ఆమె భావించారట. అయితే, కాలక్రమేణా ప్రియ భవాని శంకర్ నటిగా మారిన తర్వాత, సినిమా ప్రమోషన్లలో పాల్గొనడం ప్రారంభించారు. ఆ సమయంలో పదే పదే ఒకే రకమైన ప్రశ్నలను ఎదుర్కోవడం, అది ఎంత అలసటతో కూడుకున్నదో ఆమె స్వయంగా అనుభవించారు. అప్పుడే ధనుష్ ప్రవర్తన వెనుక ఉన్న కారణాన్ని ఆమె అర్థం చేసుకున్నారు. తాజాగా ధనుష్‌ను కలిసినప్పుడు లేదా అతనితో నటించినప్పుడు, నువ్వు చాలా రూడ్‌గా ఉన్నావని నేను నిజంగా అనుకున్నాను, డూడ్ అని తాను అతనికి చెప్పానని ప్రియ భవాని శంకర్ వెల్లడించారు. ఈ అనుభవం ద్వారా ఆమె ఒక ముఖ్యమైన పాఠాన్ని నేర్చుకున్నారు: తెరపై కనిపించే వారి అహంకారం లేదా నిర్లక్ష్యం వెనుక వారి సొంత సమస్యలు, ఒత్తిడి ఉండవచ్చు. వారు కేవలం తమ పరిస్థితికి ప్రతిబింబం మాత్రమేనని ఆమె అన్నారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.